# స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి

బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి,
# పురుష జన్మల్లో నేర్చుకునేవి



రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘరావు


ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 2025
కాపీలు : 2,000

వెల : రూ. 70/-



పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**


తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్ : 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) జ్ఞానమాల | - | రూ.70/- |
| 3) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 4)మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 5)ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 6) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 7) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 8) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



# పత్రి గారి పుస్తకములు

| | | |
|---|---|---|
| 1) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 2) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 3) యోగుల సందేశాలు | - | రూ.160/- |
| 4) జ్ఞాన సందేశాలు | - | రూ.160/- |
| 5) పత్రీజీ సందేశాలు | - | రూ.160/- |
| 6) విజ్ఞానసారం | - | రూ.160/- |
| 7) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |

# స్త్రీ జన్మల్లో, పురుష జన్మల్లో నేర్చుకునేవి?

సహజంగా నేను స్త్రీని లేదా నేను పురుషుడిని అనుకుంటారు. కానీ ఇవన్నీ మనకి జన్మలు. స్త్రీ అయితే స్త్రీ జన్మ, పురుషుడైతే పురుష జన్మ. అంటే మనం స్త్రీ కాదు, పురుషుడు కాదు, మనమంతా ఆత్మలం. ఆత్మలమైన మనం పూర్ణాత్మ నుంచి కానీ, మూలాత్మ నుంచి కానీ విడువడిన అంశాత్మలం. ఈ అంశాత్మ ఒక మానవ శరీరంలో ప్రవేశపెట్టబడి జీవుడిగా పిలవబడుతుంది.

ఆ జీవుడికి ఆ పూర్ణాత్మ ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. ఏమిటంటే? నువ్వు ఈ భూమి మీద ఎన్నో పాఠాలు నేర్చుకుని, జ్ఞానాన్ని పొంది మా స్థాయికి రావాలి అంటే పూర్ణాత్మ కావాలి. అప్పటిదాకా నువ్వు జన్మలు తీసుకుంటూనే ఉంటావు, అని చెప్పి జనన, మరణం చక్రంలో ప్రవేశ పెడుతుంది. అలా ప్రతి ఒక్కరూ మానవ జన్మలో ప్రవేశిస్తారు. అప్పటినుంచి కర్మ చక్రంకూడా ప్రారంభమవుతుంది.

అలా జనన మరణ చక్రంలో ప్రవేశపెట్టబడిన అంశాత్మ, పూర్ణాత్మ కావాలంటే 400 నుండి 500 జన్మలు పడుతుంది అని పత్రిగారు చెప్పడం జరిగింది.

అలా జనన మరణ చక్రంలో ప్రవేశపెట్టబడిన వీళ్ళు ఎన్నో నేర్చుకోవాలి, కారణం వీళ్లు కూడా పూర్ణాత్మ కావాలి కాబట్టి. ఎందుకంటే పూర్ణాత్మకి తెలియనిదంటూ ఏదీ లేదు, పూర్ణాత్మని సహ సృష్టి కర్త అంటారు, అంటే కో క్రియేటర్ అని పిలుస్తారు.

సృష్టికర్త ఈ సృష్టిలో ఎన్నో లోకాల్ని, ఎన్నోరకరకాల జీవుల్ని ఎలా సృష్టి చేస్తూ ఉంటాడో! అలా అంశాత్మ అంటే మనం కూడా ఆ పూర్ణాత్మ స్థాయికి ఎదిగితే అలాంటి పనులే చేయగలుగుతాం. మరి అలాంటి

పనులు చేయాలి అంటే ఎన్నో నేర్చుకోవాలి? అందుకే అన్ని జన్మలు పడుతుంది.

అందుచేత ఈ అంశాత్మ అన్ని రకాల పాఠాలు నేర్చుకోవాలి కాబట్టి సగం పురుష జన్మలు, సగం స్త్రీ జన్మలు తీసుకుంటుంది. అంతేకాదు ఎన్నో రకాల మతాలలో, ప్రాంతాలలో, కులాలలో, కుటుంబాలలో కూడా జన్మ తీసుకొని రకరకాల పాఠాలు నేర్చుకుంటుంది. ఎందుచేతనంటే అన్ని రకాల పాఠాలు ఒకే రకమైన జన్మలో రావు, సాధ్యం కాదు. ఒక లక్షణం నేర్చుకోడానికే చాలా జన్మలు పట్టొచ్చు. అలా రకరకాల జన్మలలో నేర్చుకుంటూ, నేర్చుకుంటూ పూర్ణ స్థితి పొంది చివరకు ప్రతీ ఆత్మ పూర్ణాత్మగా మారుతుంది. ఈ లక్ష్యం సాధించేదాకా ఆత్మకి తృప్తి వుండదు.

చూడండి మీరు మీ ఇంటిని వదిలి ఇతర రాష్ట్రాలకు కాని, దేశాలకు కాని చూడడానికి వెళ్లారు అనుకొందాం. అక్కడ ఎంత ఎంజాయ్ చేసినా మీరు అక్కడే ఉండి పోదాము అనుకోరు, ఎప్పుడు ఇంటికి చేరదామా అని అనుకుంటారు. అలాగే పూర్ణాత్మ నుంచి విడునటువంటి అంశాత్మలమైన మనం తిరిగి మన స్వలోకం అంటే పూర్ణాత్మ ఉండే సత్యలోకం చేరే దాకా మనకు తృప్తి ఉండదు.

చూడండి ఎవరైనా ఎక్కడికి వెళ్ళినా స్వగృహం చేరవలసిందే! మన స్వగృహం సత్య లోకం. అక్కడికి చేరే దాకా ఈ జీవిత ప్రయాణం ఆగదు. మరి అక్కడికి చేరాలి అంటే ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి, ఎన్నో అనుభవాలు పొందాలి. ఎంతో జ్ఞానం సంపాదించుకోవాలి.

అందుచేత స్త్రీ జన్మల్లో ఏం నేర్చుకుంటాం? పురుష జన్మల్లో ఏం నేర్చుకుంటాం? అన్న విషయాలు కొన్ని తెలుసుకుందాం.

**స్త్రీ జన్మల్లో ముఖ్యంగా నేర్చుకునేవి:** 1. ప్రేమ, 2. ఓర్పు, 3. సహనం, 4. త్యాగం, 5. పవిత్రత నేర్చుకుంటాం.

**పురుష జన్మల్లో ముఖ్యంగా నేర్చుకునేవి:** 1. ధైర్యం, 2. వీరత్వం, 3. నిర్భయం, 4. సాహసం, 5. చొరవ నేర్చుకుంటాం. ఇవి కొన్ని ముఖ్యమైన లక్షణాలు ఇవి కాక ఇంకా ఎన్నో నేర్చుకుంటాం.

అలా జన్మ తీసుకున్నాక పురుష జన్మల్లో కొన్ని, అలాగే స్త్రీ జన్మల్లో కొన్ని నేర్చుకుంటూ ఉంటారు. ఈ జన్మ పరంపరలో ప్రారంభ జన్మల్లో అంటే 100 నుంచి 150 జన్మల్లో ఉన్నవాళ్ళ పరిస్థితి ఒక రకంగా వుంటుంది, మధ్యస్థ జన్మలు అంటే 150 నుండి 300 జన్మల్లో ఉన్న వాళ్ళ పరిస్థితి ఇంకోరకంగా ఉంటుంది అలాగే చివరి జన్మలు అంటే 300 నుండి 400 జన్మల్లో ఉన్న వాళ్ళ పరిస్థితి ఇంకా మారిపోతుంది అలాగే ఆఖరి జన్మలు అంటే 400జన్మలు దాటిన వారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది.

ఇక్కడ స్త్రీగా కొన్ని జన్మల్లో నేర్చుకుని, మరల పురుష జన్మలోకి వచ్చారనుకోండి, వారు పురుషుడిగా వున్నా కూడా, ఆ స్త్రీ జన్మల్లో నేర్చుకున్నటువంటి ఆ లక్షణాలు వారిలో కనిపిస్తాయి. అంతకుముందు స్త్రీ జన్మలో ప్రేమ నేర్చుకునివుంటే పురుషుడిగా జన్మించినా కూడా ఆ ప్రేమనే ప్రదర్శిస్తూ ఉంటారు.

అలాగే పురుష జన్మల్లో ధైర్యం నేర్చుకుని తర్వాత స్త్రీ జన్మ తీసుకుంటే అంతకుముందు నేర్చుకున్నటువంటి ధైర్యాన్ని స్త్రీగా ప్రదర్శిస్తూ ఉంటుంది. ఆ భార్య, భర్తల్ని చూస్తే.. ఆ స్త్రీకి ఉన్న ధైర్యం ఆ పురుషుడికి వుండదు. ఆవిడ నువ్వు మగాడివేనా? అని అనడం కూడా జరుగుతుంది. ఎందుకంటే వాడు ఇంకా ధైర్యం అనే లక్షణం నేర్చుకోలేదు కాబట్టి.

అలా స్త్రీ జన్మల్లో నేర్చుకొని పురుష జన్మలోకి వచ్చినా కూడా

అవి ప్రదర్శిస్తారు. అలాగే పురుష జన్మల్లో నేర్చుకుని స్త్రీ జన్మలోకి వచ్చినా కూడా ఆ లక్షణాలు ప్రదర్శించ గలుగుతారు.

సహజంగా అన్ని జన్మలు ఎందుకు? ఒక జన్మలో అన్నీ సాధించ లేమా? అని అనుకోవచ్చు. కానీ ఎవరికైనా ఒక గుణం కానీ, లక్షణం కానీ మార్పు చెందాలి అంటే కొన్ని జన్మలే పడుతుంది. అందుకే లోకంలో "పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకల్లో పెట్టినా పోదు" అంటారు.

అసలు పట్టుదల లేనివారికి ఒక్కొక్క లక్షణం సాధించాలంటే కొన్ని జన్మలే పడుతుంది. ఒకవేళ పట్టుదలతో సాధించాలని అనుకున్నా ఈ సృష్టిలో నేర్చుకోవలసింది, పొందవలసింది ఎంతో ఉంది. నాకు కూడా జ్ఞానం పెరిగే కొద్దీ నేర్చుకోవాల్సింది చాలా ఉంది అన్నది అర్థమైంది.

చాలామంది ఏమంటారు అంటే ఆ భగవంతుడు నన్ను ఎందుకు సృష్టించాలి? ఎందుకు ఇన్ని కష్టాలు పెట్టాలి? నేను అడిగానా? అని చెప్పి బాధపడుతూ ఉంటారు. కాని వారు అవి కష్టాలు అనుకుంటారు. కానీ ఆ కష్టాల ద్వారా వీరూ నేర్చుకోవాల్సిన పాఠాలు ఉన్నాయని వాళ్లకు తెలియదు. ఆ కష్టాల ద్వారానే వారు ఎన్నో నేర్చుకుంటారు.

మీరు స్త్రీ అయినా సరే, పురుషుడైనా సరే మీ జీవితంలో ఏం జరుగుతున్నా, జరిగినా దాని గురించి బాధపడడం, సంతోషించడం కాదు. ఇప్పుడు ఒక సంఘటన జరిగినా, గొడవ జరిగినా, లేదా ఎందులోనైనా లాభం కలిగినా! నష్టం వచ్చినా అందులో నుంచి నేను ఏం నేర్చుకోవాలి? అన్న దృష్టిలో మీరు ఆలోచించాలి. కచ్చితంగా అందులో నేర్చుకోవాల్సింది ఉంటుంది. అది నేర్చుకున్నప్పుడు మీరు చాలా తొందరగా ఎదుగుతారు. తొందరగా ఎదిగినవారికి జన్మలు తగ్గుతాయి.

అందుచేత లాభం వస్తే పొంగిపోవడం, నష్టం వస్తే కుంగిపోవడం కాదు. నష్టం వస్తే ఏం నేర్చుకోవాలి? లాభం వస్తే ఏం నేర్చుకోవాలి?

అన్నది తెలుసుకోవాలి. అది నేర్చుకోవడానికి ప్రయత్నం చేయాలి, అంతేకాని నష్టం వస్తుందని ఏడవడం కాదు.

గుర్తుంచుకోండి మీ లాభము శాశ్వతం కాదు, మీ నష్టము శాశ్వతం కాదు, మీ సుఖము శాశ్వతం కాదు, మీ కష్టము శాశ్వతం కాదు, ఈ సృష్టిలో మీ జీవితంలో ఏది శాశ్వతం కాదు. ఇది అర్థం చేసుకుంటే మీరు ఎప్పుడూ దుఃఖపడరు.

మీ జీవితంలో ఏం జరుగుతున్నా, ప్రతిదీ నేను పాఠాలు నేర్చుకోవడానికే అన్నది మర్చిపోకండి. మీ జన్మలను మీరే ఎన్నుకొని వస్తారు అని పత్రి గారు చెప్పారు కదా? ఆ రకం జన్మ ఎందుకు ఎంచుకున్నాం అంటే? ఆ జన్మ ద్వారా అంటే ఆ స్త్రీ జన్మ ద్వారా, ఆ పేదవాడి జన్మ ద్వారా, ఆ కులంలో, ఆ మతంలో, ఆ దేశంలో, ఆ ప్రాంతంలో, నేర్చుకోవాల్సింది నేర్చుకోవడానికే అలాంటి జన్మ తీసుకున్నామని తెలుసుకోండి.

చాలామంది అనుకుంటూ ఉంటారు. అరే ఆ కులంలో పుట్టుంటే బాగుండును, ధనవంతుడిగా పుట్టుంటే బాగుండును, లేదంటే ఆ దేశంలో పుట్టుంటే బాగుండును ఏంటో ఈ అడవిలో పుట్టాను అనుకుంటారు. కాని అవన్నీ నేర్చుకోవడానికే! అందుచేత దేనికి బాధపడవలసిన పని లేదు. ఏం జరిగినా, ఏం జరుగుతున్నా అన్నీ మన మంచికే, మన ఎదుగుదలకే అలా జీవితంలో నేర్చుకుంటూ ఉండడమే మనం చేసేది.

కొంతమంది పిల్లలు పుట్టకపోతే బాధపడతారు. కాని దాని నుంచి కూడా నేర్చుకోవాల్సింది ఉంటుంది. పిల్లలు ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటి? పత్రిగారు చెప్తారు కదా? ఎవరి మీద, దేని మీద మమకారం వుండకూడదని. అంతకుముందు జన్మల్లో నీకు ఆ మమకారం పోలేదు, అందుచేత పిల్లలు లేకుండా ఎదగాలనే ఆ రకమైన జన్మ తీసుకున్నావు.

అంతేకాదు గత జన్మలలో నువ్వు చేసిన పాపాల నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలనే నీకు పిల్లలు ఉండకపోవచ్చు. నువ్వు గత జన్మల్లో కోడిగుడ్లు బాగా ఇష్టంగా తిన్నావు. అంటే ఈ భూమి మీదకి ఒక జీవి రావడానికి ప్రయత్నిస్తూ ఉంటే నీ రుచి కోసం, నీ ఆకలి తీర్చుకోవడం కోసం దాన్ని పిండ దశలోనే గుడ్డులో ఉన్నప్పుడే తినేసావు. ఆ చేసిన కర్మనుంచి పాఠం నేర్చుకోవడానికే ఈ జన్మలో పిల్లలు లేకుండా జన్మ తీసుకున్నావు.

అసలు నువ్వు వచ్చింది పిల్లల కోసం కాదు. నువ్వు ఆత్మవు, నీ లక్ష్యం సాధించడానికి వచ్చావు అన్నది మర్చిపోకూడదు.

ఆ పిల్లలు ఉన్నవాళ్ళు పిల్లలమీద  మమకారంతో జీవితమంతా వాళ్ళకే వెచ్చిస్తూ ఉంటారు, ఇంకో పని చేయరు. ఆత్మైన తాను ఎన్నో నేర్చుకోవాలి, ఎంతో ఎదగాలి అన్న సంగతి తెలీదు. అది తెలియక ఆ కొడుకు మీద, కూతురి మీద,  మమకారంలో పడి వాళ్ళ కోసమే జీవితం అంతా వెచ్చిస్తూ ఎంతో నష్టపోతారు.

అలా ఏదో పాఠం నేర్చుకునే జన్మ తప్ప, ఎన్ని జన్మల్లో పిల్లల్ని కనలేదు చెప్పండి?    ఎవరికి పిల్లలు ఉండరు? ఎప్పుడూ పిల్లలతోటే గడిపేస్తే ఎప్పటికి  నేర్చుకుంటారు? ఓ పత్రి గారిలా, షిరిడీ బాబాలా, సత్యసాయి బాబాలా, వేమనలా, వివేకానందుడిలా ఎదగాలి కదా?

పిల్లల మీద మమకారం, ఆ సరదాలు వాళ్ళకి ఉండవు. వాళ్ళు అవన్నీ అంతకుముందు జన్మల్లో  నేర్చేసుకున్నారు, ఇంకేం నేర్చుకుంటారు? అందుకే కొంతమంది   శంకరాచార్యుల వారిలాగ, వివేకానంద లాగ వివాహం కూడా చేసుకోరు. వాళ్ళకి కావల్సింది జన్మలు కాదు జీవిత లక్ష్యం. నేను పూర్ణాత్మ కావాలి, ఒక సహ సృష్టికర్త కావాలి, సత్య లోకానికి చేరాలి అనే తీవ్రకాంక్ష తప్ప ఇంక దేని మీదా వాళ్ల దృష్టి ఉండదు.

వేటి మీద మమకారం వున్నా మళ్లీ జన్మలు తీసుకోవాలి. అందులోనే కూరుకుపోతే ఎలా? అసలు నువ్వు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చావు? దేనికోసం వచ్చావు? ఇది ఆలోచించవే. నేను స్త్రీ అంటావు, ఈ కులం, ఈ మతం అంటావు, ఎంజాయ్ చేయడానికి చూస్తావు. భర్త పోతే ఏడుపు, భార్య పోతే ఏడుపు, పిల్లలు లేకపోతే ఏడుపు. ఆత్మవైన నువ్వు ఆ పైలోకాల నుంచి వచ్చింది దేనికి? ఇలా ఏడవడానికా? పాఠాలు నేర్చుకోవడానికా?

అందుచేత ఏమి జరిగినా, ఏమి జరుగుతున్నా, ఏ సంఘటన జరిగినా, దీని నుంచి నేను నేర్చుకోవాల్సింది ఏముంది? అని ప్రశ్న వేసుకోవాలి. అంతేకానీ అయ్యో ఇలా జరిగిందే, ఈ రోగం వచ్చిందే, ఈ ఆర్థిక ఇబ్బంది వచ్చిందే, ఎలా బయట పడతాను? లేకపోతే నా వృద్ధాప్యంలో ఈ పిల్లలు చూస్తారో చూడరో? ఇలా బాధపడతారు. కానీ మీరు చేయవలసింది చేయండి జరగవలసింది అదే జరుగుతుంది.

భూమ్మీదకి పంపించిన వాడు నీకు తిండి లేకుండా చేస్తాడా? శ్రీ రామతీర్థకి ఇలాగే విరక్తి కలిగింది. ఆయన మోక్షం పొందాలని చిన్న మూటలో ఓ అంగవస్త్రము, ఓ చెంబు, గ్లాసు  పెట్టుకుని అన్నీ వదిలేసాడు. ఎక్కడ వీలైతే అక్కడ సాధన చేస్తు తిరుగుతున్నాడు. ఆయనకి ఎక్కడో అక్కడ, ఎవరో ఒకళ్ళు ఏదో ఒకటి ఇస్తూనే ఉన్నారు. అలా ప్రయాణం చేస్తూ ఉంటే ఆయనకి అనిపించింది.

ఏమిటి నేను ఈ మూట కూడా పట్టుకెళ్తున్నాను? నన్ను సృష్టించినవాడు నా అవసరాలు తీర్చలేడా? ఇది కూడా నాకెందుకు? అని ఆ మూట ఆ ప్రక్కనే ఉన్న నదిలో పడేసాడు. అప్పుడు ఆయనదగ్గర ఏమీ లేవు. అలా ఆ సాధన మీదే దృష్టి పెట్టాడు. ఆయనకు ఎవరో ఒకళ్ళు, ఏదో ఒకటి సమకూర్చేవారు.

ఆ టైంకి ఇవన్నీ ఉంటేనే మన జీవితం నడుస్తుందని అనుకోవడం చాలా మూర్ఖత అని ఆయన జీవితంలో నుంచి మనం నేర్చుకోవచ్చు. అందుచేత ఏవో సంపాదించడం మీదే దృష్టి పెట్టడం వల్ల జన్మలు పెరుగుతాయి తప్ప అంతకన్నా ఇంకేమీ జరగదు. అందుకే పత్రి గారు అవసరానికి పరిమితం అవ్వండి అంటారు.

మీకు ఉండడానికి అద్దె ఇల్లో, సొంత ఇల్లో ఏదో ఒకటి ఉందా లేదా? తినడానికి ఉందా లేదా? కట్టుకోవడానికి ఏదో బట్ట ఉందా లేదా? సహజీవనం చేయడానికి ఒక తోడు అంటే భర్తకాని, భార్యకాని ఉందా లేదా? చూసుకోవాలి.

అవసరాలు తీరుతూ ఉంటే ఉన్న సమయమంతా ఈ పాఠాలు నేర్చుకోవడానికి, జ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించాలి. అందుకే నేను భీమవరం క్లాసు మానవద్దు, అవకాశం కల్పించుకునైనా రావడానికి ప్రయత్నించండి అంటాను, జూమ్ కూడా మానవద్దంటాను.

మీలో చాలామంది ఇది రికార్డ్ అవుతుందికదా తర్వాత వినొచ్చు అని అనుకుంటారు. కాని జూమ్ లైవ్ లో మీరు విన్నది వేడి వేడి అట్టు తిన్నట్టు. తర్వాత చూసింది చల్లారిపోయిన అట్టు తిన్నట్టు. లైవ్ లో ఆయన ఇంకా ఏం చెప్తారు? ఇంకా ఏమి తెలుసుకుంటాం? అని ఎంతో ఆతృతతో ఉంటారు. ఏదో పని చేసుకుంటూ వింటే అంత దృష్టి ఉండదు, వినేసి వదిలేస్తారు.

జూమ్ లో దృష్టి పెట్టి వింటూ ఉంటే బాగా అర్థమవుతూ వుంటాయి, తప్పనిసరిగా ఆచరణ కూడా ఉంటుంది. అలా ఎంత శ్రద్ధ చూపిస్తే అన్ని పాఠాలు నేర్చుకుంటారు, అన్ని జన్మలు తగ్గించుకుంటారు.

అంతేకాదు మీకు నష్టం వచ్చినా, కష్టం వచ్చినా పాఠం నేర్చుకోవడానికే అని తెలుసుకోవాలి.

భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతాయి, ఏంటో సంసారం ఇలా అయిపోయింది అనుకుంటారు. మీరు ఆత్మ అన్నది అర్థమైతే, అవగాహన ఉంటే అందులోనుంచి కూడా పాఠాలు నేర్చుకోవాల్సింది వుంది అన్నది అర్థమవుతుంది. అప్పుడు పట్టుదలలు ఉండవు, పంతాలు ఉండవు, ఏ విషయం గురించి ఆందోళన పడరు, చేయకూడని పనులు చేయరు, ధర్మాన్ని తప్పరు, సృష్టి నియమాలు తెలుసుకుంటారు, సృష్టికి అనుగుణంగా జీవిస్తారు.

అందుచేత సత్యం తెలుసుకున్న వాడికి అంటే నేను ఆత్మ అన్న విషయం తెలుసుకున్న వాడికి దుఃఖమే వుండదు, అన్నీ నేర్చుకోవడానికే అన్నది అర్థమవుతుంది, అంతా ఆనందమే. ఒక రకంగా ఈ సత్యం నా జీవితాన్నే మార్చేసింది. నేను దేహం అనుకున్నప్పుడు ఇంకా ఇంకా సంపాదించాలనుకున్నాను. నేను ఆత్మను అని అర్థమైన తర్వాత ఎంత సంపాదించినా ఏంటి ఉపయోగం? ఈ సంపాదన వల్ల ఆత్మకి ఏమీ లాభం లేదు కదా? అని తెలుసుకున్నాను.

పైగా ఆ సంపాదన కోసం ఈ దేహంతో చేసే తప్పులు, పాపాలు, అధర్మమైన పనుల వల్ల వచ్చే ఫలితం మళ్లీ అనుభవించాలి అన్నది అర్థమయ్యి, అన్ని వ్యాపారాలు మానేసి జ్ఞాన సంపాదన మీద దృష్టి పెట్టాను. ఈ దేహం కేవలం పాఠాలు నేర్చుకోవడానికే అన్నది తెలుసుకున్నాను.

అలాంటి అవకాశమే ఈ సృష్టిలో ఇవ్వబడింది. ఈ దేహం ఎన్నాళ్ళు ఉంటుంది? ఎన్నాళ్ళు పనిచేస్తుంది? ఆలోచిస్తే బాల్యం పని చేయదు, వృద్ధాప్యం పని చేయదు, యవ్వనంలో చూస్తే సరదాలు, కోరికల తోటే సరిపోతుంది. అసలు ఆత్మ గురించి ఆలోచించడానికి సమయం

ఎక్కడ వుంటుంది చెప్పండి?

అందుకే శంకరాచార్యుల వారు

**బాలస్తావత్క్రీడాసక్తః**
**తరుణస్తావత్తరుణీసక్తః ।**
**వృద్ధస్తావచ్చింతాసక్తః**
**పరసే బ్రహ్మణి కోపిన సక్తః ॥**

తా:- బాల్యమంతా ఆటపాటలయందు ఆసక్తి చేతను, యవ్వన మంతా స్త్రీ వ్యామోహము చేతను, వార్ధక్యం సంసార చింతల చేతను జీవితమంతా గడుపుతున్నారు, కాని పరబ్రహ్మమునందు ఆసక్తి కలవారెవ్వరు లేరు.

మరి ఇంకెప్పుడు ఆత్మైన నీ గురించి నువ్వు ఆలోచిస్తావు? అంటారు శంకరాచార్యుల వారు. రావడము, వెళ్ళడమేనా? అందుకే **"పునరపి జననం, పునరపి మరణం"** అంటారు.

అందుచేత దేహం అనే భావంలో ఉంటే  నీ జన్మ వృధా చేసుకున్నట్టే. నేను ఆత్మ అన్నది అవగాహన కలిగి ఉంటే ఎన్నో నేర్చుకుంటావు. ఈ దేహం అన్నది ఆత్మకు ఒక అమూల్యమైన అవకాశం. అందుచేత నేను దేహం అన్నట్టుగా జీవించే వారి ప్రవర్తన, నేను ఆత్మ అన్నట్టుగా జీవించేవారి ప్రవర్తన పూర్తిగా భిన్నంగా ఉంటుంది.

నేను దేహం అని జీవించేవాడు ఇతరులంతా వేరు వేరు అనే భావంలో ఉంటాడు. వాడు తప్పు చేస్తున్నాడు, వాడు పొరపాటు చేస్తున్నాడు, వాడు చేయకూడనిది చేస్తున్నాడు, అని విమర్శిస్తూ ఉంటాడు. ఎదుటి వాళ్ళను చూసి అసూయతో ఏడుస్తూ ఉంటాడు, ప్రక్కవాడిపై ద్వేషం పెంచుకుంటాడు. నేను ఆత్మని, వాళ్ళూ ఆత్మలే అందరూ ఎదగడానికి వచ్చిన వాళ్ళమే అన్న సత్యం వాడికి తెలీదు.

ఈ అజ్ఞానంలో ఉన్నవాడు తన పని తాను చూసుకోడు, ఎప్పుడూ ఇతరుల గొడవే. తన గురించి ఆలోచించడు ఇతరుల గురించే ఆలోచిస్తాడు. పత్రి గారు చెప్తారు ఇతరుల గొడవ నీకెందుకు? ఎవరు ఏది నేర్చుకోవాలో అది నేర్చుకుంటూ ఉంటారు, నీ పని నువ్వు చూసుకో అంటారు. ఆయన ఇతరులని విమర్శించవద్దు, 'నో కామెంట్స్' అంటారు.

పత్రిగారు ఓ సందర్భంగా ఏం చెప్పారంటే భూమి మీదకి వచ్చిన వాళ్ళు ఎవ్వరైనా సరే, ఏ స్థాయిలో ఉన్నవారైనా సరే తప్పులు చేస్తూ వుంటారట. ఏ స్థాయిలో ఉన్నవాళ్ళు ఆ స్థాయికి తగ్గట్టుగా తప్పులు చేస్తూ వుంటారట. అందుచేత తప్పులు చేయనివాడు అంటూ ఎవరూ ఉండరు అన్నారు.

"A" లెవెల్ లో ఉన్నవాడు "A" తప్పులు చేస్తాడు. అప్పుడు "B" లో వున్నవాడికి.. "A" తప్పు చేస్తున్నట్టుగా ఉంటుంది. ఆ "A" స్థాయిలో ఉన్నవాడు "B" స్థాయికి వస్తే, అప్పుడు వాడికి ఆ "A" తప్పులు కనిపిస్తూ ఉంటాయి. అలాగ "Z" దాకా వచ్చిన వాడికి "Y" చేసే తప్పులు కనిపిస్తాయి. అలా ఎవడి స్థాయిలో వాడు తప్పులు చేస్తూంటారు.

అలా అందరూ తప్పులు సరిచేసుకునే ప్రయత్నంలో వున్నవాళ్లే. పాఠాలు నేర్చుకుంటారు, తప్పులు సరి చేసుకుంటారు. ఎప్పుడైతే వాడు 'జడ్' స్థాయికి వచ్చాడో, పూర్తిగా తప్పులు చేయడో వాడికి ఇంక జన్మ వుండదు.

ఈ కాషాయలు ధరించడం అన్నది కూడా అందరిని మోస గించడమే కానీ అంతకన్నా ఏమీ లేదు. బాగా పై స్థాయికి వెళ్ళాక అలా వేసుకున్నారు అంటే వాళ్ళు కూడా ఒక తప్పు చేస్తున్నట్టే అంటారు. స్వామి వివేకానంద విషయంలో అదే చెప్తారు పత్రిగారు.

అలా రామకృష్ణ పరమహంస వివాహం చేసుకుని భార్యకి

ఇవ్వాల్సిన సుఖాన్ని ఇవ్వకుండా తల్లితో సమానంగా చూసారు. అది ఆ స్థాయిలో ఆయన చేసిన తప్పు. వీటన్నింటికీ మళ్లీ ఇంకొక జన్మ తీసుకొని దాన్ని సరి చేసుకోవాల్సి ఉంటుందంట. అలాగే ఆ స్థాయికి వెళ్ళిన వారు కొంతమంది తమకున్న శక్తులు ప్రదర్శిస్తారు. ప్రజలని జ్ఞానంతో ఆకట్టుకోవాలి కానీ శక్తులతో ఆకట్టుకోకూడదంట. అందుకే పత్రి గారు ఆయనకి ఎన్ని ఉన్నా ఏమి లేనట్టుగా ఉండేవారు.

అందుచేత నేను ఆత్మ అన్నది అవగాహన ఉన్నవాడు నేను ఈ సంఘటనలో నుంచి నేర్చుకుంటున్నాను అనే భావంలో ఉంటాడు. నేను దేహము అనే అజ్ఞానంలో ఉన్నవాడు తప్పులు చేస్తూ ఉంటాడు. ఇందులో ఆత్మకాని వాళ్ళు ఎవరు చెప్పండి? అందరూ మూలాత్మలో నుంచి వచ్చినవారే కదా! అందరూ ఒకటే కదా! కొన్ని జన్మలు ఎక్కువ తీసుకున్న వాళ్ళు కొన్ని నేర్చుకున్నారు, కొంచెం జన్మలు తక్కువ ఉన్నవాళ్ళు ఇంకా నేర్చుకోలేదు. అంతే తప్ప ఇంక ఏ తేడా లేదు. కొన్ని జన్మలు పోతే వీడు ఆ స్థాయికి వస్తాడు.

వాళ్ళు చేసే దాంట్లో తప్పు కనిపిస్తే ఆ తప్పుని ఖండించాలి, విమర్శించడం కాదు. పత్రిగారు ఖండించేవారు, ఆయన విగ్రహారాధన వద్దు అన్నారు. కానీ విగ్రహారాధన చేసేవాళ్ళు కోట్ల మంది ఉన్నారు. విగ్రహారాధన వద్దు అంటే ఎంతో మందికి బాధ కలుగుతుంది. అంతేకాదు ఈయన మతం మార్చడానికి వచ్చాడా? అని భావించేవారు. ఆయన ఎవ్వరిని విమర్శించేవాడు కాదు వాళ్ళు అజ్ఞానంతో చేసే ఆ పనిని ఖండించేవాడు అంతే.

మీరు సత్యం తెలుసుకోండి, సత్యాన్ని ఆశ్రయించండి అనేవారు. సత్యం పట్టుకున్న వాడు జయంతో దూసుకుపోతాడు. అసత్యం పట్టుకున్నవాడు జీవితాన్ని వృధా చేసుకుంటాడు. అందుకే ఖండించేవాడు.

అలాగే ఆయన "మాంసం వద్దు శాఖాహారమే ముద్దు" అని నిర్మొహమాటంగా, నిర్భయంగా చెప్పేవాడు. లోకంలో చూస్తే మాంసం తినేవాళ్లే ఎక్కువ శాతం మంది వున్నారు. వారు ఏమనుకుంటారంటే ఏంటి ఈయన ఇలా చెప్తున్నాడు? మా తాతలు తిన్నారు, ముత్తాతలు తిన్నారు అంటారు. ఇంకా కొంతమంది అది మా వ్యాపారం అది మానేస్తే ఇప్పుడు మా బ్రతుకులు ఎలా? ఇలా మాట్లాడినా, ఎవరు బాధపడినా, ఏం చేసినా సత్యం నిర్భయంగా చెప్పేవాడు.

పత్రిగారు 18 ఆదర్శ సూత్రాల్లో 14వ సూత్రం విగ్రహార ఆరాధన వద్దు సత్యారాధనే చేయాలన్నాడు. ఆయన సత్యమే భగవంతుడు, విగ్రహం భగవంతుడు కాదు. మానవుడు చేసిన విగ్రహం భగవంతుడు ఎలా అవుతాడు? మానవుని చేసినవాడే భగవంతుడు. ఆయనే సత్యం, ఆయన్నే పట్టుకోవాలి అని నిర్మొహమాటంగా చెప్పారు. మొదట్లో ఈయన ఈ ఒక్క పాయింట్ తీసేస్తే బాగుండును అని నేను అనుకునేవాడిని, వర్రీ పడేవాడిని.

తర్వాత తర్వాత ఈ సత్యం అర్థమయ్యాక, దైవం అంటే ఏంటో తెలుసుకుని ఏకంగా మాంసాహారం మీద పుస్తకమే వ్రాశాను. అప్పుడు పత్రిగారి గురించి అర్థమైంది. అబ్బా ఎంత ధైర్యంగా ఆ సత్యాన్ని చెప్తున్నాడు అని. అప్పటినుంచి నేనూ చెప్పడం మొదలు పెట్టాను. అందుచేత ప్రతి ఒక్కళ్ళు నాకు తెలిసిందే కరెక్టు అని ఎప్పుడూ అనుకోవద్దు. ఇప్పుడున్న జ్ఞాన పరిధిలో నీకు ఇలా అనిపిస్తుంది. సత్యం తెలిసి, నీ జ్ఞానం పెరిగే కొద్దీ నీ అభిప్రాయం నువ్వే మార్చుకుంటావు.

చాలామంది నేను దేహం కాదు ఆత్మను అని తెలుసుకోవడమే జ్ఞానం అనుకుంటారు. కానీ ఈ కంటికి కనిపించని దాని గురించి తెలుసుకోగలగడమే జ్ఞానం. ఈ కంటితో తెలుసుకునేదంతా అజ్ఞానమే. ఈ కంటితో తెలుసుకోలేనిదే జ్ఞానం. అది ఎంత తెలుసుకుంటే మీరు

అంత జ్ఞానవంతులు. ఈ కంటితో మీరు తెలుసుకునేదంతా అసత్యమే. ఈ కంటితో తెలుసుకోలేనిదే సత్యం.

ఈ కంటితో మీరు తెలుసుకుని నేను ఎంతో తెలుసుకున్నాను అని అనుకుంటే మీరేమి జ్ఞానం పొందినట్టు కాదు. ఎంత తెలుసున్నా అది అజ్ఞానమే. మీ కంటి తో చూడగలిగేది ఏదైనా ఉండేది కాదు. అంతా అదృశ్యం అయిపోయేదే, ఉండనిదే, శాశ్వతం కానిదే, మార్పు చెందేది. ఈ కళ్లతో నువ్వు ఏది చూసినా అది అసత్యమే. నువ్వు మూడో కన్నుతో చూసేదే సత్యం. ఈ శరీరంతో నువ్వు అదృశ్యమయ్యే ఈ ప్రపంచంలోనే తిరగ గలవు. నీ సూక్ష్మ శరీరంతో ఈ కంటికి కనిపించని ఎన్నో లోకాలు తిరగగలవు, ఎన్నో తెలుసుకోగలవు.

ఆ జ్ఞానం అంతా సంపాదించడానికే ఈ అతీంద్రియ శక్తులు. నువ్వు సాధన బాగా తీవ్రాతి తీవ్రంగా చేసినప్పుడు, నీలో అంత తపన ఏర్పడినప్పుడు, నీకు ఇంకో గొడవ లేకుండా దాని మీదే ఉన్నప్పుడు, నువ్వు ఇంకా అది నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నప్పుడు, ఆ ప్రకృతే నీకు ఆ శక్తిని ఇస్తుంది. ఎవరికైనా ఇస్తుంది, దాన్ని నువ్వు నీ జ్ఞానం పెంచు కోవడానికి ఉపయోగించాలి. కానీ స్వార్థానికి ఉపయోగించుకోకూడదు.

అందుచేత మనం స్త్రీ అయినా సరే, పురుషుడు అయినా సరే, ఎవరైనా సరే ఎప్పుడూ నేను ఆత్మను అని గుర్తుపెట్టుకోవాలి. ఈ దేహం నేను కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి మాత్రమే తీసుకున్నాను. అంతే తప్ప ఇక్కడ ఏదో ఎంజాయ్ చేయడానికి, అనుభవించడానికి, సుఖపడడానికి కాదు అన్నది అర్థం చేసుకోవాలి.

జ్ఞానం పెరిగే కొద్దీ మీకు అసలు దుఃఖం ఉండదు. అజ్ఞానంలో ఉంటేనే దుఃఖం. అందుకే పత్రి గారు అన్నారు “పీసమెత్తు దుఃఖం ఉన్నా నువ్వు అజ్ఞానంలో ఉన్నట్టే” అని. సీతాదేవి భర్తకు దూరమై అశోకవనంలో ఉన్నా కూడా ఆవిడ శోకించలేదు. కారణం ఆవిడ జ్ఞాని కాబట్టి.

అందుచేత ఇప్పుడు స్త్రీ జన్మలలో నేర్చుకునే వాటి గురించి తెలుసుకుందాం.

# "స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి"

స్త్రీ జన్మల్లో ముఖ్యంగా ప్రేమ, ఓర్పు, సహనం, త్యాగం, పవిత్రత లాంటివి నేర్చుకుంటారు. ఈ లక్షణాల్లో ముందు "ప్రేమ" గురించి తెలుసుకుందాం.

## 1) ప్రేమ

స్త్రీలు తమ భర్తను, పిల్లలను ఎంతగానో ఇష్టపడతారు. వారిని ఎంతో ప్రేమిస్తారు. స్త్రీలకి అందరికంటే వారే ముఖ్యం. వారికోసం ఎన్నో సుఖాలు కూడా వదులుకుంటారు. ఎందుచేతనంటే దానికి కారణం వారి మీద ఉన్న ప్రేమే.

మానవులు ప్రారంభ జన్మల్లో తమోగుణంలో ఉంటారు. ఓ 100, 150 జన్మలు దాటేసరికి రజో గుణంలోకి వస్తారు. 150, 300 జన్మలు దాటేసరికి సాత్విక గుణంలోకి వస్తారు. ఆ 300, 400 జన్మలు దాటేసరికి శుద్ధ సాత్వికంలోకి వస్తారు. 400, 450 జన్మలు దాటేసరికి నిర్గుణంలోకి వస్తారు.

ఈ తమోగుణంలో ఉండే వారి లక్షణం బద్ధకం. వీళ్ళెప్పుడు వీళ్ళ గురించే చూసుకుంటారు. రజో గుణంలో వారికి అహంకారం వుంటుంది. నేను నేను అనేటటువంటి భావం ఉంటుంది. సాత్వికగుణం లోకి వచ్చేసరికి కొంచెం అందరి గురించి ఆలోచించడం లాంటివి చేస్తూ ఉంటారు. నిర్గుణంలోకి వచ్చేసరికి నిస్వార్ధంగా అందరినీ ప్రేమిస్తారు. తమోగుణంలో దేహస్థితి, రజోగుణంలో మనోస్థితి, సాత్విక గుణంలో బుద్ధి స్థితి, నిర్గుణంలో ఆత్మ స్థితిలో ఉంటారు.

అంటే తమోగుణంలో దేహానికి ప్రాముఖ్యం ఉంటుంది.

రజోగుణంలో మనసుకు ప్రాముఖ్యం ఉంటుంది. సాత్విక గుణంలో బుద్ధికి ప్రాముఖ్యం ఉంటుంది. అంటే బుద్ధి బాగా పనిచేస్తుంది. నిర్గుణంలో ఆత్మకు ప్రాముఖ్యం ఉంటుంది అంటే ఆత్మ స్థితిలో జీవిస్తూ ఉంటారు.

అందుచేత ఈ గుణాలు మారే కొద్దీ ఏ స్త్రీలో అయినా సరే ఈ ప్రేమ కూడా మారుతూ ఉంటుంది. మెల్లి మెల్లిగా ఈ తమో గుణం, రజో గుణంలో  అవధులతో ఉన్నటువంటి ప్రేమ అంటే తన భర్త, తన పిల్లలు కాబట్టి ప్రేమిస్తూ ఉంటారు. ఇక సాత్వికం, నిర్గుణ స్థితికి చేరేసరికి అవధులు లేని ప్రేమగా మారుతుంది అంటే ఆత్మ ఎదిగే కొద్ది ఈ ప్రేమ అన్నది సహజ గుణం అయిపోతుంది. తన పిల్లల్ని, భర్తనే కాదు అందరినీ కూడా ఆ రకంగా ప్రేమించే స్థాయికి ఎదుగుతూ ఉంటారు.

అలా ఈ ప్రేమ అనే లక్షణం స్త్రీ జన్మల్లో బాగా ఎక్కువ నేర్చుకో గలుగుతారు. పురుష జన్మల్లో నేర్చుకుంటారు కానీ స్త్రీ జన్మల్లో నేర్చుకున్నంత ఉండదు. అందుచేత ఈ ప్రేమ అనే లక్షణం ఎవరిలోనైనా పెరగాలి అంటే పూర్ణాత్మ స్థితికి ఎదగాలి. పూర్ణాత్మ అంటే ఎవరు? భగవంతుడు. ఆయన ప్రేమ స్వరూపుడు. ప్రేమ అనేది ఆయన సహజ లక్షణం. అందుకే పూర్ణాత్మస్థితికి ఎదిగే కొద్ది ప్రేమ అనేది సహజ లక్షణం అవుతుంది.

అందుకే సత్య సాయిబాబా వారు ప్రేమ, సేవ అని ఎక్కువ చెప్తారు. ఒక్కొక్క గురువు లోకంలో ఉన్న మానవులకి కొన్ని కొన్ని లక్షణాలు బాగా బోధించడానికే భూమి మీదకి వస్తారు. ఈ సాత్విక గుణ లక్షణం బాగా అందరిలోనూ కలగజేయడమే సత్యసాయిబాబా యొక్క అవతార లక్ష్యం. పత్రి గారి జన్మ లక్ష్యం ఏంటంటే? ఈ సాత్విక గుణంలోకి వచ్చిన వాళ్ళని నిర్గుణంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

దానికి తగ్గ సాధన ఇచ్చి, ఈ సాత్విక గుణం కూడా దాటించే ప్రయత్నం చేశారు పత్రి గారు. ఆయన  ఎవరికైనా తమోగుణ, రజోగుణ దోషాలు ఉంటాయి, అలాగే సాత్విక గుణ దోషం కూడా ఉంటుంది అని

చెప్పడమేకాదు, దాన్ని అధిగమించే "శ్వాస మీద ధ్యాస" ధ్యాన సాధన ఇచ్చారు. ఆ రకమైనటువంటి జ్ఞానం కూడా పంచారు.

ఈ రకంగా స్త్రీ జన్మలో ఎవరైనా ప్రేమ అన్నది బాగా నేర్చుకుంటారు. ముందు అవధులతో కూడిన ప్రేమ ఉంటుంది, మెల్లిమెల్లిగా దైవ లక్షణమైన అవధులు లేని సహజ ప్రేమ అయిపోతుంది. దానికి ఈ 'శ్వాస మీద ధ్యాస' చాలా ఉపకరిస్తుంది. ఎవరైతే ఈ 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం చేస్తూ ఉంటారో మెల్లి మెల్లిగా మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గి, ఆత్మ ప్రాముఖ్యం పెరుగడం వల్ల వారిలో ఆ లక్షణాలు మెల్లిగా సంతరించుకుంటాయి.

## 2) ఓర్పు

స్త్రీ జన్మలో నేర్చుకునే ఇంకొక లక్షణం "ఓర్పు". స్త్రీలలో ఈ ఓర్చుకునే గుణం ఎంతో ఉంటుంది. వాళ్ళ జీవితంలో చాలా కష్టాలు వుంటాయి. ఎన్ని ఉన్నా పిల్లల కోసం ఓర్చుకుంటూ ఆ సంసారాన్ని అలాగే కొనసాగిస్తూ ఉంటారు.

అలాగే సంభోగ సమయంలో కూడా భర్తను సుఖ పెట్టడానికి ఎంతో ఓర్చుకుంటారు. తన సుఖం కంటే భర్త సుఖమే ముఖ్యంగా భావిస్తారు. అందుకే ఆ సమయంలో భర్త ఎంత కఠినంగా వ్యవహరించినా ఓర్చుకుంటుంది కానీ భర్తను మాత్రం వదిలి పెట్టడానికి ఇష్టపడదు. అందుకే స్త్రీ జన్మ అన్నది ఓర్పును నేర్చుకోవడానికే అని చెప్పి పెద్దలు చెప్తూ వుంటారు.

అంతేకాదు భర్త పోయినా కూడా ఎంతో ఓర్చుకుంటుంది. కారణం ఆ పిల్లల కోసం ఎంతో త్యాగం చేస్తుంది. స్త్రీ జన్మలో ఎంత ఓర్చుకుంటారో! భర్త పోయిన వాళ్ళకే తెలుస్తుంది. అదే పురుషుడు అయితే భార్య పోతే ఇంకొక స్త్రీని చేసుకుంటాడు. రెండు పెళ్ళిళ్లు కాకపోతే మూడు పెళ్ళిళ్లు చేసుకుంటాడు. కానీ సహజంగా స్త్రీ దానికి ఇష్టపడదు. మరి ఎలా వుండ గలుగుతుంది అంటే? ఆ ఓర్చుకునే గుణం వల్లే వుండగలుగుతుంది.

మనం గమనిస్తే సహజంగా భార్యల కంటే కూడా భర్తలే ముందర చనిపోతూ ఉంటారు. భర్త లేని భార్యలు ఎంతో మంది కనిపిస్తారు. భార్య లేని భర్తలు చాలా తక్కువగా కనిపిస్తారు. కారణం వాళ్లు ఎక్కువగా రెండో పెళ్లి చేసుకోవడం వల్ల.

భర్తలు ఎందుకు ముందు పోతారు అంటే? దానికి ముఖ్య కారణం భర్త జీవితంలో కుటుంబం కోసం ఎంతో కష్టపడతారు. ఎన్నో సమస్యలు, ఒత్తిడిలతో సతమతమవుతూ వుంటారు. సహజంగా సంపాదన భాధ్యత, కుటుంబ పోషణ భాధ్యత భర్తకే వుంటుంది. అలాంటి ఒత్తిడులు కొన్ని భార్య దృష్టికి తీసుకురాకుండా తానే భరిస్తూ వుంటాడు, చాలా అలసిపోతూ ఉంటాడు. అందుచేత కొంచెం ముందే నిష్క్రమిస్తాడని నేను అనుకుంటాను. జీవితంలో పురుషుడికి ఉన్నటువంటి ఒత్తిళ్లు స్త్రీకి ఉండవు.

స్త్రీ కావాలని అవన్నీ మీదేసుకుంటుంది తప్ప, లేకపోతే స్త్రీకి తక్కువే. అవన్నీ తనవిగా భావిస్తూ తాను ఒత్తిడికి గురవుతుంది. అందుచేత భర్త దూరమైతే పూర్తి కుటుంబ భాధ్యత వహించాలంటే ఎంత ఓర్పు వుండాలో ఒక్కసారి ఆలోచించండి!

మానవుడికి మూడు రకాల అగ్నులు ప్రజ్వరిల్లుతూ వుంటాయి. జఠరాగ్ని, కామాగ్ని, జ్ఞానాగ్ని. జఠరాగ్ని అంటే ఆకలి. ఈ జఠరాగ్ని దహించినప్పుడు ఆ ఆకలిని చల్లార్చకపోతే తట్టుకోవడం ఎంత కష్టమో! కామాగ్ని ప్రజరిల్లినప్పుడు ఆ కోరికని చల్లార్చకపోతే అది తట్టుకోవడం కూడా అంతే కష్టం. కోరికన్నది పైకి కనిపించదు. అందుచేత ఓర్చుకోవడం సామాన్యమైన విషయం కాదు.

ఇప్పుడు విదేశాల్లో పురుషులే కాదు, స్త్రీలు కూడా మళ్లీ వివాహాలు చేసుకుంటున్నారు, కానీ భారతదేశంలో ఈ ఆచారం తక్కువ. సాధారణంగా ఈ హిందూ మతంలో భారతదేశంలో భర్త పోతే భార్య వివాహం చేసుకోదు.

భర్త పోగానే ఇంక నువ్వు దేనికి పనికి రావు అన్నట్టుగా ఆ గాజులు తీసేస్తారు, బొట్టు తీసేస్తారు, గుండు చేస్తారు, ఇంక అదే నీ జీవితం అని చెప్పి అంటారు. ఆవిడ బాధ ఎవ్వడు పట్టించుకోడు, పైగా ఆవిడ దేనికి పనికి రానట్టుగా వెలేస్తూ ఉంటారు. కాని ఇప్పుడు అందరిలాగే వాళ్ళకి కోరికలు  వుంటాయని పెద్దలు అర్థం చేసుకుంటున్నారు, కొద్ది కొద్దిగా సమాజంలో మార్పు వస్తుంది. అంటే  హిందూ మతంలో ఆ రకంగా ఈ ఓర్పు అనేటటువంటి లక్షణం బాగా నేర్చుకుంటారు.

గౌతమ బుద్ధుడు 2500 సంవత్సరాల క్రితం ఏం చేశాడంటే ఈ జ్ఞానాన్ని పొంది ఎన్నో దేశాలు పర్యటించి ఆ దేశాల్లో ఉన్న వాళ్ళందరినీ తన మార్గంలో తీసుకొచ్చాడు. ఆ సమయంలో ఆయన కాలిన నడకన తిరుగుతూ ఈ జ్ఞానాన్ని బోధించడం వల్ల భారతదేశంలో ఉన్నటువంటి హిందూ మతం పోయి బౌద్ధ మతంగా మారిపోయింది.

అప్పుడు ఈ హిందూ మతంలో జన్మ తీసుకుని నేర్చుకోవాల్సినవి నేర్చుకునే అవకాశం లేకుండా పోయింది. హిందూ మతమే లేకపోతే హిందూ మత ఆచారాలు, అవి పాటిస్తూ నేర్చుకోవాల్సినవి ఎక్కడ నేర్చుకుంటారు? అందుచేత ప్రకృతి శంకరాచార్యుల వారిని భూమ్మీదకి పంపడం జరిగింది.

ఆయన కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా కాలినడకన తిరిగి ఈ బౌద్ధ మతాన్ని పూర్తిగా నిర్మూలించి భారతదేశంలో మరల హిందూ మతాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఆయన ఆరామాలు తీయించేసి ఆలయాలు కట్టించాడు. అలా శంకరాచార్యులవారు మళ్లీ  హిందూ మతాన్ని పునరుద్ధరించడం జరిగింది. సృష్టిలో ఈ మార్పు నడిపించే సృష్టికర్తదే. ఎందుకు అంటే? లోకంలో హిందువుగా జీవిస్తూ నేర్చుకోవాల్సినవి నేర్చుకోవాలి కాబట్టి.

అందుచేత ప్రతి ఒక్కరూ అన్నీ నేర్చుకోవాలి అంటే ప్రతి ఆత్మ హిందువుగానూ నేర్చుకోవాలి, అన్నిమతాల్లోనూ నేర్చుకోవాలి, అలాగే అన్ని కులాలలో నేర్చుకోవాలి, అన్ని ప్రాంతంలో నేర్చుకోవాలి. అలాగే ధనవంతుడిగా, పేదవాడిగా ఎన్నో రకాలుగా నేర్చుకోవాలి.

పూర్వం ఈ హిందూ మత ఆచారాల్లో భర్త చనిపోతే మళ్లీ వివాహం చేయకుండా వాళ్ళని వేలేసినట్టు చూసేవారు, ఫంక్షన్లకి రానివ్వరు, బయట కనపడనివ్వరు, వెధవావిడ అనేటువంటి ఒక బిరుదు కూడా ఇచ్చేవారు.

ఇప్పుడు అవన్నీ మారిపోయాయి అనుకొండి. అలా మళ్ళీ 1000, 2000 ఏళ్ళయ్యే సరికి ఇంకో రకమైన మార్పులు రావచ్చు. ఈ సృష్టిలో ఈ మార్పు అన్నది కూడా సహజమే.

ఏది ఏమైనా ఆ ఓర్పు అన్నది స్త్రీ జన్మలో బాగా నేర్చుకుంటారని మనకి అర్థమవుతుంది. అంతేకాదు స్త్రీ జన్మలో గర్భం ధరించిన సమయంలో స్త్రీ ఎంత ఓర్చుకుంటుందో మనం గమనించొచ్చు. తొమ్మిది మాసాలు మోసి, ప్రసవ సమయంలో కూడా ఎంతో బాధను ఓర్చుకుంటుంది. శిశువుకి జన్మనివ్వడం స్త్రీ బాధ్యతే కానీ పురుషుడిది కాదు. అది ఎంత బాధ అంటే ఆవిడ ప్రసవించే సమయంలో ఇక జీవితంలో భర్తతో కలవకూడదని నిర్ణయించుకుంటుంది. ఎంత నిర్ణయించుకున్నా అది ప్రసూతి వైరాగ్యంలా అప్పటివరకే ఉంటుంది.

ఆ సమయంలో స్త్రీ ఎంతో ఓర్పును నేర్చుకుంటుంది. ప్రతి స్త్రీ కూడా తన జీవితంలో ఎన్నో రకాలుగా, ఎన్నో విషయాల్లో, ఎన్నో సందర్భాల్లో ఎంతో ఓర్చుకుంటుంది. ఈ ఓర్చుకునే లక్షణం పూర్తిగా ఒక జన్మలోనే అలవడదు, అలా కొన్ని జన్మలు తీసుకొని ప్రతి జన్మలో ఈ ఓర్చుకునే లక్షణాన్ని కొద్ది కొద్దిగా పెంచుకుంటారు. అప్పుడు ఓర్పు అన్నది పరాకాష్టకు వెళ్తుంది. సహజ లక్షణమవుతుంది.

ఈ సృష్టిలో ఏది శాశ్వతం కాదు. అంటే మనకు వచ్చిన కష్టాలు గాని, నష్టాలు గాని, రోగాలు కానీ, ఏవైనా సరే శాశ్వతం కాదు. కానీ సహజంగా కష్టం వచ్చినప్పుడు భరించలేక ఆ గుళ్ళకు వెళ్తారు, చర్చిలకు వెళ్తారు, మసీదులకి వెళ్తారు. ఆ గురువుని, స్వామీజీని, ఆ బాబాలని పట్టుకుంటారు. అలా అన్ని చోట్లకూ తిరుగుతూ ఉంటారు.

కానీ  కొంచెం అవగాహన ఉన్నవాడు ఈ కష్టం ఎందుకు వచ్చింది? అన్నది ఆలోచిస్తాడు. మన వాళ్ళందరూ చెప్తారు. మనం గతంలో చేసిన కర్మ వల్ల అని. ఈ కర్మ వల్ల వచ్చినటువంటి ఈ కష్టం ఎలా పోతుంది? అంటే ఆ కర్మ  అనుభవిస్తే పోతుంది. మరి ఆ కష్టాన్ని అనుభవించాలంటే కొన్నాళ్ళు ఓర్చుకోవాలి కదా? అది ఓర్చుకుంటే మెల్లిగా దాంట్లో నుంచి బయట పడతారు.

ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన మనకి ఉన్న లాభం ఏమిటంటే? ఈ ధ్యానం చేయడం వల్ల అపారంగా శక్తి సంపాదిస్తాం. ఎప్పుడైతే ఆ శక్తి ఉంటుందో దేన్నైనా బాగా తట్టుకుంటాం, ఓర్చుకుంటాం. అలా ఓర్చుకోవడం వల్ల ఆ సమస్య నుంచి కొంతకాలానికి బయట పడతాం.

పత్రి గారి దగ్గర కూడా ఈ ఓర్చుకోవడం అన్నది నేను గమనించాను. ఆయన్ని ఎంతో మంది ఆయన శిష్యులే విభేదించారు. కానీ ఆయన ఎవరినీ ఏమి అనలేదు, అందరి విమర్శలు శాంతంగా ఓర్చుకున్నారు,  సంవత్సరాల తరబడి ఓర్చుకున్నారు

చివరకు ఎవరైతే ఆయన్ని విభేదించారో వాళ్లే మళ్ళీ ఆయన దారిలోకి వచ్చారు. ఒకసారి నేను పత్రి గారితో మీరు  వారిలో మార్పు రావాలని ఏంత ఓపిక పట్టారండి అన్నాను. ఆయన ఎంత పెద్ద సమస్య అయినా ఓర్చుకున్నాడు.

ఈ ఓర్పు అన్నది స్త్రీ జన్మల్లో చాలా ఎక్కువగా వుంటుంది, బాగా

నేర్చుకుంటారు. అందుకే ఆ రకంగా నేర్చుకొని చివరి జన్మలోకి వచ్చేసరికి వారి ప్రవర్తన పత్రిగారిలా ఉంటుంది.

ఒక సందర్భంగా మన మాస్టర్స్ తోటే నేను కొంచెం కఠినంగా వ్యవహరించాను. అది పత్రిగారి దృష్టికి వెళ్ళింది. ఆ విషయం తెలిసి పత్రి గారు నాతో ఏమన్నారంటే? ఏమయ్యా నువ్వు బ్రహ్మర్షివి, కొంచెం ఓర్చు కోవాలి, నేను ఓర్చుకోవట్లేదా? అన్నారు.

అంటే నీకు ఓర్పు ఉండాలి నాయనా అని హెచ్చరించారు.

ఈ ఓర్పు అన్నది ఎవరైనా స్త్రీ జన్మల్లో బాగా నేర్చుకుంటారు. ఏదైనా ఒక్క జన్మలోనే రాదండి, అలా కొన్ని జన్మలలో ఆ లక్షణం సహజమైపోతుంది.

## 3) సహనం

ఈ సహనం అన్నది ఎవరికైనా చాలా అవసరం. ఈ సహనం అనే లక్షణం స్త్రీ జన్మలో నేర్చుకునేటటువంటి ఒక గొప్ప లక్షణం. ఈ స్త్రీ జన్మ కూడా ఎప్పుడు ఒకే కులంలో, ఒకే మతంలో, ఒకే ప్రాంతంలో ఒకే రకంగా తీసుకోరు. ప్రపంచంలో ఎన్ని రకాల కులాలు, మతాలు, కుటుంబాలు వుంటాయో, అన్నింటిలోనూ స్త్రీలు జన్మలు తీసుకుంటారు, తీసుకోవాలి కూడా.

మీరు కనక గమనిస్తే చాలా సంసారాల్లో భర్తలు చాలా కఠినంగా వ్యవహరిస్తారు, స్త్రీలపై ఎన్నో ఆంక్షలు విధిస్తారు. భర్త ఎప్పుడూ భార్యను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలని చూస్తాడు, వాడు భార్యతో చెప్పకుండా ఎక్కడికైనా వెళ్ళిపోతాడు, కానీ భార్య మట్టుకు భర్తతో చెప్పకుండా, పర్మిషన్ లేకుండా ఎక్కడికి వెళ్ళకూడదు. ఒకవేళ భార్య వినకపోతే ఎదురు తిరిగి తిట్టడమే కాదు కొట్టడం కూడా చేస్తాడు.

భర్త ఆ రకంగా భార్యను లొంగదీసుకోవాలని చూస్తాడు. కానీ వాడు ఎన్ని చేసినా, ఎంత కఠినంగా వ్యవహరించినా భార్య సహనంతో

భరిస్తుంది. అంతేకానీ భర్తను వదిలిపెట్టడానికి ఇష్టపడదు. అది స్త్రీ లక్షణం. మనం గమనిస్తే కొన్ని కులాలలో, కొన్ని మతాలలో స్త్రీలపై ఎన్నో రకాల ఆంక్షలు విధిస్తారు. స్త్రీలను ఒక మనిషిగా కాకుండా బానిసలా చూస్తారు. వారి కోసమే స్త్రీ అన్నట్టుగా ప్రవర్తిస్తారు.

అయినా సరే అన్నీ సహిస్తూ.. స్త్రీ సంసారాన్ని కొనసాగిస్తుంది. అందుచేత ఈ సహనం అన్నది స్త్రీ సహజ లక్షణం అయిపోతుంది. ఆ లక్షణం ఉండబట్టే ఈ సంసారాలు ఇలా కొనసాగుతున్నాయి. కానీ ఎక్కడో చాలా తక్కువ సందర్భాలలో అలా ఎదురు తిరిగిన, సహనం చూపించక పోయినా గొడవలు జరగడమే కాదు విడాకులు దాకా వెళ్ళిపోతుంది.

పురుష అహంకారతో సమాజం స్త్రీలను ఇవాళ కాదు యుగాలు నాటి నుంచి అణిచి పెట్టింది, స్త్రీలకు పురుషులతో సమాన హక్కు లేకుండా చేసింది. పూర్వకాలంలో పెద్దలు, పండితులు ఎక్కువగా పురుషులే వుండేవారు. ఆ పండిత పెద్దలు తెలివితేటలతో ఏం చేశారంటే? ఆ స్త్రీలకు పతివ్రత అనే బిరుదు ఒకటి ఇచ్చారు. పతివ్రత అనే పేరుతోటి ఎన్నో ఆంక్షలు విధించారు. వాళ్ళు చెప్పింది కరెక్టు అని అనిపించడానికి ఆ పురాణాలలో పతివ్రతల కథలను కూడా వాళ్ళు వ్రాయడం జరిగింది.

వాళ్లు భర్త కోసం ఎన్నో కష్టాలు, బాధలు ఓర్చుకుంటూ ఎంతో పవిత్రంగా జీవించేవారు. భర్తను తప్ప ఇంకొకరిని కన్నేసి చూడటానికి వీలులేదు. ఇంకొకరి మీద దృష్టి పడిందా వాళ్ల ప్రాతివత్యం పోయినట్టే! అలాంటి కథలు వ్రాసేవాళ్లు. అవన్నీ ఈ సమాజంలో నాటుకుపోయి స్త్రీ అనేసరికి ఓ.. మనం అలా ఉండాలా అని భావించేవారు. 'సతికి పతియే ప్రత్యక్ష దైవం' అంటే భార్యకు ఎక్కడో దేవుడు లేడు ఎదురుగా ఉన్న భర్తే దైవం అని ఆ పురాణ కాలంలోని పెద్దలు వ్రాయడం జరిగింది. కానీ అలా వ్రాసినవారు కూడా పురుష పండితులే.

‘సతికి పతియే ప్రత్యక్ష దైవం’ అని వ్రాశారు కానీ ‘పతికి సతియే ప్రత్యక్ష దైవం’ అని ఎక్కడా వ్రాయలేదు! ఈ కథలన్నీ చదివి అదే కరెక్టేమోనని స్త్రీలు భావించేవారు. స్త్రీ అన్నాక అలాగే జీవించాలేమో అనేటటువంటి భావన సమాజంలో ఏర్పడింది. ఏది ఏమైనా ఒక్కటే మనం గుర్తు పెట్టుకోవాలి. ఇలాంటివన్నీ సమాజంలో ఉండడం వల్ల ఆ స్త్రీజన్మలో సహనం అన్నది ఆ ఆత్మ నేర్చుకుంటుంది, ఇవన్నీ ప్రకృతి నిర్ణయం ప్రకారమే జరుగుతాయి.

అందుచేత గమనిస్తే యుగాలనుంచి కూడా భర్తతో సమానమైన హక్కులు లేకుండా ఈ సమాజం చేయడం జరిగింది. స్త్రీ ఇంటికి, వంటింటికి పరిమిత మయ్యింది. మీరు కనుక మహమ్మదీయ మతంలో  చూస్తే అసలు స్త్రీకి ఏ రకమైన హక్కులు ఉండవు. వారు అసలు బయటికే రాకూడదు, వచ్చినా బురఖా కప్పుకోవాలి.

కానీ పురుషుడికి ఏ నియమాలు లేవు. ఆ మతంలో పురుషుడు ఎంతమంది స్త్రీలనైనా పెళ్లి చేసుకోవచ్చు, ఆ హక్కు భార్యకి లేదు. ఏ భార్యనైనా సరే ఇష్టం లేకపోతే మూడు సార్లు తలాక్ చెప్పి నీకు నాకు సంబంధం లేదు అని విడాకులు ఇచ్చేయొచ్చు. అంతేకాదు స్త్రీలు మసీదుకి వెళ్ళకూడదు, పుణ్యక్షేత్రాలకు వెళ్ళకూడదు, మక్కాకు కానీ ఏ పుణ్యక్షేత్రం కానీ వెళ్లే హక్కు లేదు. ఒక రకంగా వాళ్ళు పురుషుల కోసమే అన్నట్టుగా జీవిస్తారు.

ముస్లిం మతంలో స్త్రీలు ఎలా ఉంటారంటే  పిల్లల్ని కని పెంచే యంత్రాల్లా ఉంటారు. ఇదంతా సహనం నేర్చుకోవడానికే ఆ మతంలో వున్న ఏర్పాటు అని అనుకోవాలి.  ఒక రకంగా చెప్పాలంటే మహమ్మదీయ మతంలో  స్త్రీ చాలా సహనం నేర్చుకుంటుంది. మహమ్మదీయ మతంలో పురుషులుగా ఉన్నవాళ్ళు కూడా  సహనం నేర్చుకోవడానికి మరుజన్మలో మరలా స్త్రీలు అవ్వవచ్చు. అది వాళ్ళకి తెలీదు వాళ్ళు ఇంక జన్మ లేదు

అనుకుంటారు.

అలాగే ఒక ఆత్మ పూర్ణాత్మ కావాలి అంటే ఏదో ఒక మతంలో జన్మ తీసుకుంటే పూర్ణాత్మ కాలేదు అన్ని రకాల మతాల్లో కూడా జన్మ తీసుకోవాలి. అందుకే భూమ్మీద ఇన్ని రకాల మతాలు ఉన్నాయి. ఎవ్వరైనా సరే నేను ఫలానా మతం అని భావించాడు అంటే వాడు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్టే! అంతా ఒకటే అనే భావంలోకి వచ్చినప్పుడే వాడికి జ్ఞానం వున్నట్టు.

ఇక్కడ హిందూ మతంలో ఉంటాడు ముస్లింలను ద్వేషిస్తాడు, తర్వాత వాడే ముస్లిం మతంలోకి పుడతాడు హిందువుల్ని ద్వేషిస్తాడు. ఇక్కడ హిందూ మతంలో హిందువుగా పోట్లాడుతాడు, ముస్లింలని చంపుతాడు. ముస్లిం మతంలో పుట్టి తర్వాత హిందువుల మీద పోట్లాడుతాడు హిందువుల్ని చంపుతాడు. ఈ సృష్టిలో ఉన్న ఏర్పాటు చాలా విచిత్రంగా ఉంటుంది.

ఏదైతే పైకి కనిపిస్తూ వుందో, జరుగుతూ వుందో ఇదంతా వాస్తవం కాదు. ఇదంతా ఒక "మాయ". మాయ అంటే ఉన్నట్టుగా కనిపిస్తుంది. కానీ చివరకు వుండదు. ఇప్పుడన్ని జరుగుతున్నట్టుగా, అన్నీ వున్నట్టుగా వున్నాయి కానీ ఏది వుండేది కాదు.

ఒక సినిమాలో ఒకడు మహారాజు వేషం వేశాడు. నిజంగా వాడు రాజు అయినట్టా! ఒక మినిస్టర్ వేషం వేశాడు వాడు మినిస్టర్ అయినట్టా! అది ఆ సినిమా వున్నంతసేపే. ఈ జీవితం కూడా సినిమానే. ఆ సినిమాని ఒక డైరెక్టర్ నడిపిస్తే ఈ జగత్తు అనే నాటకాన్ని ఆ జగన్నాటక సూత్రధారుడు, ఆ సృష్టికర్త ఆడిస్తున్నాడు అంతే. నాది నాటకంలో ఒక రోల్ అనే జ్ఞానం ఉంటే ఎవరిమీద మీకు కోపం రాదు, అసూయ కలగదు, ఎవరినీ దూషించరు, విమర్శించరు, ఎవరి గురించి నిర్ణయాలు చెప్పరు. ఇది తెలియకే ఈ పనులన్నీ చేస్తున్నారు.

ఇప్పుడు భారతదేశంలో చాలామంది ఎంతో బాధపడుతూ వుంటారు. హిందూ మతం అంతా ఇతర మతాల్లోకి వెళ్ళిపోతున్నారు అని. విచిత్రం ఏంటంటే ఎప్పుడూ సృష్టిలో ఏది పూర్తిగా లేకుండా పోదు, అన్ని వుండాలి అన్ని వుంటాయి కూడా.

కొన్ని కొన్ని దేశాల్లో అంటే రష్యా, మరియు ముస్లిం దేశాల్లో కూడా హిందూ మతం వ్యాప్తి చెందుతుంది. ఎక్కడ? ఏది ఉండాలి? ఎక్కడ? ఏది ఉండకూడదు? అన్నది సృష్టికర్త నిర్ణయం ప్రకారం జరుగుతుంది. సృష్టి ఇలా కొనసాగాలంటే అన్నీ ఉండవలసిందే. అందుచేత మనం ఎవరం? మనమేం చేయాలి? మనమేం సాధించాలి? అన్న వాటి మీద దృష్టి పెట్టాలి.

అవన్నీ మనకు అవసరం లేదు ఆయనే చూసుకుంటాడు. మన ఆరాటం ఎంతసేపు ఏ రకంగా పూర్ణాత్మ కావాలి అన్న దాని మీద వుండాలి. అందుచేత మానవుడు ఈ లక్షణాలను స్త్రీ జన్మలో కొన్ని, పురుష జన్మల్లో కొన్ని సంతరించుకొని పరిపూర్ణుడు అవుతాడు. చివరకు పూర్ణాత్మ కాగలుగుతాడు.

## 4) త్యాగం

స్త్రీ జన్మల్లో నేర్చుకోవాల్సిన ఇంకొక ముఖ్య లక్షణం “త్యాగం”. త్యాగం అంటే ఇంచుమించు అన్నీ వదులుకుంటూ ఉంటారు. భర్త కోసం, కుటుంబం కోసం, పిల్లల కోసం స్త్రీ తనకు ఉన్నటువంటి ఎన్నో కోరికలు, సరదాలు వదులుకుంటుంది.,అంటే త్యాగం చేస్తుంది.

మీరు గమనిస్తే ఏ భార్య అయినా సరే భర్త, పిల్లలు తిన్న తర్వాతే తింటుంది. వండడం తనే వండుతుంది, కానీ వాళ్లు తిన్న తర్వాతే తను తింటుంది. ఏది మిగిలితే అది తిని సంతృప్తి పడుతుంది. అరే నాకు ఇష్టమైంది చేశాను ఆ కూర మిగలలేదు అని అనుకోదు. అలా ఆ భర్త,

పిల్లలు తింటే తన కడుపు నిండిపోయినట్టే భావిస్తుంది.

ఆ చేసినవి రుచిగా ఉంటే వాళ్ళే ఎక్కువగా తినేస్తారు, అలాంటప్పుడు ఒక్కోసారి సరిపోదు కూడా. అయినా ఆవిడేమి అసంతృప్తి చెందదు, అంత గొప్ప త్యాగం చేస్తుంది స్త్రీ. అందుచేత ఆవిడ తను తినే కంటే భర్త, పిల్లలు తింటేనే తృప్తిగా భావిస్తుంది. అలా జీవితంలో ఎన్నో విషయాలలో భర్త కోసం, పిల్లల కోసం త్యాగం చేస్తుంది.

స్త్రీకి కూడా పురుషుడిలాగే ఎన్నో కోరికలు, ఆశలు, సరదాలు ఉంటాయి. కానీ తన కుటుంబం కోసం వాటన్నిటిని త్యాగం చేస్తుంది. అంతేకాదు ఆ పిల్లల్ని కని పెంచే సమయంలో ఆ చంటి పిల్లల కోసం తన నిద్రను త్యాగం చేస్తుంది, తన సుఖాలు త్యాగం చేస్తుంది. అలా ఎన్నో జన్మలలో త్యాగం చేసేసరికి త్యాగం అన్నది స్త్రీకి సహజ గుణం అయిపోతుంది.

మనం ఆత్మలము అని తెలుసుకున్నాం, ఆత్మైన మనము పూర్ణాత్మ కావాలి అన్నదే మన లక్ష్యము అని అర్థం చేసుకున్నాం. 350 జన్మలు దాటి ఉన్నాం కాబట్టే మన లక్ష్య సాధన కోసం, మన ఎదుగుదల కోసం ఇప్పుడు ఎన్నో త్యాగం చేస్తున్నాం. రుచులు వదులుకుంటున్నాం, మన కోరికలు, సరదాలు, మన ఇష్టాలు, సినిమాలు, సీరియల్స్ ఇలా ఎన్నో త్యాగం చేస్తున్నాం. ఇదంతా గత జన్మలో త్యాగం అన్న లక్షణం నేర్చుకో బట్టే. కాని ప్రారంభ జన్మల్లో ఉన్నవాళ్లు త్యాగం చేయలేరు.

రమణ మహర్షి జీవితంలో ఎంత త్యాగం చేశాడు! ఏదుంటే అది తిని కడుపు నింపుకునేవాడు, పంచభక్ష పరమాన్నాలు ఏమి కోరలేదు. ఆయనకి శరీరం సాధన చేస్తే చాలు, శరీరం తన లక్ష్యానికి అవసరమైన పనులు చేసి పెడితే చాలు అనుకున్నాడు. ఆయన మిగతావన్నీ పట్టించుకోలేదు.

మనమంతా ఆ స్థితిలో వున్నాం. ఆ త్యాగగుణం మనందరిలో కూడా చాలా ఉంది. ఎన్ని వదిలేసుకుంటున్నాం? ఏదుంటే దాంతో సరిపెట్టుకుంటున్నాం. అందరిలా ఉండాలని, అందరిలా జీవించాలని అనుకోవట్లేదు. ఉన్న వాటితోటే సంతృప్తిగా జీవిస్తున్నాం. మిగతావన్నీ త్యాగం చేస్తున్నాం.

మనం ఎన్నో జన్మలలో ఆ త్యాగం అనే దానిని నేర్చుకోవడం వల్ల ఇప్పుడు ఆ లక్షణం మన లక్ష్యసాధనకి ఎంతో ఉపయోగపడుతుంది. ఎవరు వదులుతారండి ఇవన్నీ? మాంసం మానమంటే మానతారా? ఎవ్వరూ మానరు. నువ్వు మానేస్తే మానేయ్ అంటారు, బ్రతికేది దేనికోసం? తినకపోతే జీవితం దేనికి అన్నట్టు మాట్లాడతారు, అది ఓ బ్రతుకేనా? అంటారు.

మనం తినేది పప్పు కూడని ఆక్షేపిస్తారు. ఎంతో త్యాగ గుణం వుంటే గాని ఏ మానవుడైనా సరే తన లక్ష్యాన్ని సాధించలేడు. ఆత్మను తెలుసుకోవడానికి, ఆత్మను అనుభవంలోకి తెచ్చుకోవడానికే ఇవన్నీ త్యాగం చేస్తూ ఈ విషయాల పట్ల విరక్తి చెందుతున్నాం. భోగాలమీద, సుఖాల మీద విరక్తి చెందడమే త్యాగం. అందుకే "ఆత్మ ఆసక్తి, విషయ విరక్తి వుండాలి" అంటారు.

పత్రిగారి పరిచయం కాకముందు నా జీవితం ఒకరకంగా వుండేది. ఆయన పరిచయం అయ్యాక జీవితం పూర్తిగా మారిపోయింది. అంతకు ముందు సంపాదన, సరదాలు, భోగాలు అవే గొప్పవి అనుకునే వాడిని. ఇప్పుడు అన్నీ వదిలేసాను, మరి నేను ఎలా త్యాగం చేయగలిగాను అంటే? ఇంతకు ముందు జన్మలలో ఆ లక్షణం సంపాదించుకున్నాను కాబట్టే! ఆ లక్షణం ఎంత ఎక్కువ మీలో ఉంటే మీరు కూడా ఆధ్యాత్మికంగా అంత ఎదుగుతారు, ఎంత ఎదిగితే దుఃఖానికి అంత దూరం అవుతూ

వుంటారు.

ఎన్నో స్త్రీ జన్మలెత్తి మనం ఈ త్యాగం అనే లక్షణాన్ని సంపాదించు కున్నాం. ఆఖరికి ధ్యానంలోకి వచ్చినా కూడా భార్య తన భర్త ధ్యానం చేస్తే చాలు అనుకుంటుంది. నేను చెప్తూ ఉంటాను, నీ భర్త ఆత్మస్థితి వేరు, నీ ఆత్మ స్థితి వేరు అని. నీ సాధన నువ్వు చేసుకో, ఆయన గొడవ నీకెందుకు? అంటే ఆవిడకి తృప్తిగా ఉండదు. ఆయన కూడా చేస్తే బాగుండును, ఆయన ఇందులోకి వస్తే బాగుండును అనుకుంటుంది. అలా దృష్టి భర్త మీదే వుంచి తాను చేసే సాధనని త్యాగం చేస్తుంది.

అలాగే కొంతమంది స్త్రీలు పిల్లలుకూడా ధ్యానం చేయాలి అనుకుంటారు. వీళ్ళేమో ముసలోళ్ళు అయ్యాక దీంట్లోకి వచ్చారు. వాళ్లేమో చిన్నప్పటి నుంచే చేయాలంటారు. వాళ్ల చేత చేయించడానికి వీళ్ళు తపన పడతారు. పత్రి గారు 'వాళ్ళ టైం వస్తే వాళ్ళే చేస్తారు, వాళ్ళ గొడవ నీకెందుకు? నువ్వు చెయ్యి' అని చెప్తారు.

మనం ఆత్మలం ఎవరి ప్రణాళికతో వాళ్లు వచ్చాం. ఆ ప్రణాళిక ప్రకారము జీవించిన వాడు సవ్యంగా జీవించినవాడు. ఆ ప్రణాళికకి విరుద్ధంగా జీవించిన వాడు జీవితాన్ని నష్టపరుచుకున్నవాడు. అందుచేత ఆ సంసారం కోసం, ఆ పిల్లల కోసం, భర్త కోసం త్యాగం చేయకు. ఇది మంచి మార్గం అని చెప్పు అంతే. ఆ పనులు చేయకూడదు, అది అధర్మము, మాంసం తినకూడదు అని చెప్పు వినకపోతే నువ్వెందుకు బాధపడడం.

స్త్రీ ఈ త్యాగ లక్షణంతో తన ఎదుగుదలని ఆటంకపరచు కుంటుంది. తనకి తెలుసు ఏం చేయాలో? ఎలా జీవించాలో? అయినా కూడా వదులుకుంటుంది. అది తెలివి తక్కువ తనం. కుటుంబంలో పిల్లలు, తల్లిదండ్రులు, భర్త అందరూ రకరకాల ఆత్మ స్థితులలో ఉంటారు.

అంతా ఆత్మలే అన్న సంగతి అర్థమైతే ఇవన్నీ అర్థమవుతాయి.

వాళ్ళ అనుభవాల కోసం వాళ్ళు వచ్చారు, దానికి అనుగుణంగానే వాళ్ళ జీవితం వుంటుంది. ఎవరు ఎన్ని చెప్పినా వాళ్లకి ఎక్కదు, ఆ పనులే వారు చేస్తూ వుంటారు, మీరేం చేయగలరు? మీరు అనుకున్నట్టు వారు వుండాలంటే ఎలా వుంటారు? మీరు అనుకున్నట్టు మీరు వుండండి చాలు. అప్పుడు మీ ప్రణాళిక ప్రకారం మీరు జీవిస్తున్నట్టు.

మీరు ఒక్కటే గుర్తుపెట్టుకోండి ప్రతి ఒక్కరి శరీరంలో ఆత్మ వుంది. ఆత్మ పైలోకాల్లో నిర్ణయించుకున్న ప్రణాళిక ప్రకారం భూమి మీదకు వచ్చి మర్చిపోతుంది.

కానీ అక్కడ నిర్ణయించుకున్న దానికి విరుద్ధమైన పనులు ఇక్కడ చేస్తుంటే ఆత్మ ఘోషిస్తుంది. కానీ పైన నిర్ణయించుకుని వచ్చిన దాని ప్రకారం మీరు జీవిస్తే ఆత్మ ఎంతో సంతృప్తి చెందుతుంది, చాలా ఆనంద పడతుంది.

సహజంగా స్త్రీలు ఇంటి పనంతా చేస్తారు, భర్తకి పిల్లలకి వండి పెడతారు, తాము తింటారు రోజు ఇదే పని. అప్పుడప్పుడు ఏంటి నా బ్రతుకు ఇంతేనా? ఇది చేయడానికేనా ఈ జన్మ అని లోపల వాళ్లకి అనిపిస్తుంది. మరి ఇది ఎవరు అనిపిస్తున్నారు అంటే? లోపల వున్న ఆత్మ గుర్తు చేస్తుంది. నువ్వు ఆ పనులు చేయటానికి జన్మ తీసుకోలేదు. నువ్వు చేయవలసింది ఇంకా వుంది, నువ్వు అది చేయట్లేదు అని చెప్తుంది. అలాంటివాళ్లు ఈ ధ్యానం చేస్తున్నా, పుస్తకాలు చదువుతున్నా, ఈ ధ్యానం క్లాసులకి వెళ్తున్నా లోపల వాళ్లకి చాలా ఆనందంగా ఉంటుంది.

మీరు కావాలంటే చూడండి. మీరు ఎప్పుడైనా కొన్ని కారణాలవల్ల భీమవరం క్లాస్ మానేసినా, ఈ జూమ్ క్లాస్ ఎగ్గొట్టినా వెంటనే లోపల ఆత్మ ఘోషిస్తుంది. అప్పుడు మళ్లీ మీరు జాయిన్ అయితే లోపల ఆ ఘోష ఉండదు.

అలాగే పురుషుడు ఉదయం నుంచి కష్టపడి సంపాదించి కుటుంబాన్ని పోషిస్తాడు. రోజూ అదే పని చేస్తూ ఉంటే వాడికి అనిపిస్తుంది, ఏంటిది ఇదేనా నా లైఫ్ అని లోపల ఆత్మ ఘోషిస్తుంది. అటువంటి వారు ఎప్పుడైనా సరే ఈ ధ్యానంలోకి వచ్చినట్లయితే లోపల ఎంతో తృప్తిగా వుంటుంది, చెప్పలేని ఆనందం అనుభూతి చెందుతూ ఉంటారు.

నేను ధ్యానంలోకి రాకముందు ఏవో కొన్ని దానాలు చేసేవాడిని, కొన్ని సేవా కార్యక్రమాలు చేసేవాడిని. అలా ఉచిత హోమియోపతి హాస్పిటల్ పెట్టాను, వాటర్ కూలర్స్ పెట్టాను, మా మేడం చేత ఆడవాళ్ళకి ఉచితంగా ఒక సెంటర్ నడిపాము. అయినా లోపల తృప్తి వుండేది కాదు, ఇంకా ఏదో చేయాలి అని లోపల అనిపించేది.

కానీ పత్రి గారు పరిచయం అయ్యి ఈ మార్గంలోకి వచ్చి ఈ ధ్యానం చేసి ఈ జ్ఞానం అందరికీ అందిస్తూ ఉంటే అప్పుడు తృప్తి అనిపించింది. అంతకుముందు ఎన్ని సేవలు చేసినా నాకు తృప్తి ఉండేది కాదు. అప్పుడు ఈ పనులు చేయడానికే నేను వచ్చాను అన్నది అర్థమైంది. ఆఖరికి ఈ ధ్యాన ప్రచారం చేస్తున్నా కూడా ఎప్పుడైనా నాలుగు రోజులు ఇంట్లో వుండిపోతే స్థిమితం వుండేది కాదు, లోపల ఏదో లోటుగానే అనిపించేది.

చాలామంది ఎందుకంతలా కష్టపడతారు? హాయిగా రెస్ట్ తీసుకోవచ్చుగా అంటారు. నేను రెస్ట్ గా ఉంటాను కానీ లోపల ఆత్మ వుండనివ్వదే! ఆ ఘోష మీకు అర్థమైతే మీరుకూడా కూర్చోలేరు. మీరు కూడా చివరి జన్మల్లో ఉన్నారు . మీరు మీ సమయాన్ని వృధా చేశారంటే మీ జీవితాన్ని నష్టపోతున్నట్టే. అందుచేత అవకాశం దొరికినప్పుడు పూర్తిగా వినియోగించుకోవాలి.

మనసుకి, ఆత్మకి మధ్య సంఘర్షణలో మనసేమో సుఖపడ మంటుంది, ఆత్మ కష్టపడమంటుంది, సాధించమంటుంది, సమయం వృధా

చేయొద్దు, జీవితాన్ని వృధా చేయొద్దు అంటుంది.

అలా పాటించాలంటే జీవితంలో కొన్ని త్యాగం చేయాలి అలా త్యాగం చేసినట్లయితే  మన లక్ష్యాన్ని తేలికగా సాధిస్తాము.

## 5.పవిత్రత

స్త్రీ జన్మలోనే పవిత్రత అనే లక్షణం నేర్చుకుంటారు. స్త్రీ సహజంగా పవిత్రంగానే జీవిస్తుంది, పవిత్రంగా జీవించడానికే ఇష్టపడుతుంది, ప్రయత్నిస్తుంది. భర్తతో కాపురం కూడా పవిత్రంగానే చేస్తుంది, అలా పవిత్రంగా జీవించిన స్త్రీని పతివ్రత అంటారు. ఇది స్త్రీ లక్షణం.

సహజంగా స్త్రీలకు దైవం పట్ల భక్తి ఎక్కువగా ఉంటుంది. దైవానికి చేసే పూజలు, ఆరాధనలు లాంటి వాటి విషయంలో ఎంతో పవిత్రంగా చేస్తారు. గుడికి వెళ్ళినప్పుడు స్నానం చేసి, మంచి బట్టలు కట్టుకుని వెళ్తారు, చెప్పులు బయట వదిలి పెడతారు, ఎప్పుడైతే ఏ పనైనా పవిత్రంగా చేస్తారో మంచి ఫలితాలు పొందుతారు. భక్తి విషయంలో స్త్రీలు పవిత్రతకు ఎక్కువ ఆసక్తి చూపిస్తూ ఉంటారు.

ఆఖరికి ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన వారు కూడా ఎక్కువ మంది స్త్రీలే వున్నారు. ధ్యానం అంటే ఊరికే కళ్ళు మూసుకొని కూర్చోవడం కాదు. ధ్యానం అంటే సత్యమైన భగవంతుడిని, పరమాత్మని,  పరబ్రహ్మని ఆశ్రయించడం అంటే ఆరాధించడం. ఆ మార్గమే పత్రి గారు మనకు ఇచ్చిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం. ఈ "శ్వాస మీద ధ్యాస" ద్వారా మాత్రమే భగవంతుని ఆశ్రయించగలరు.

కానీ ఇప్పుడు చాలామంది గైడింగులు, మ్యూజిక్ లు పెట్టుకుని మనసు దగ్గరే ఆగిపోతున్నారు. మనసు దాటి ఆత్మ దగ్గరకి వెళ్లలేక పోతున్నారు. మనసు దగ్గర ఆగిపోతే దానిని జపము అంటారు, మనసు దాటితే దానిని ధ్యానము అంటారు.

ఈ ధ్యానం చేసేటప్పుడు పవిత్రంగా చేయాలి. అందుకే జూమ్‌లో ప్రతి ఒక్కళ్ళము ఉదయం స్నానంచేసి కూర్చుంటున్నాం. భగవంతుడిని ఆశ్రయిస్తున్నాం కాబట్టి పవిత్రతను పాటించాలి. గుడికి వెళ్ళినప్పుడు విగ్రహాన్ని అంటే ఆ బొమ్మని ఆశ్రయించినప్పుడే పవిత్రంగా వెళ్తున్నాం. మరి సాక్షాత్తు పరమాత్మను ఆశ్రయించినప్పుడు పవిత్రంగా వుండాలి కదా? అందుకే స్నానం చేసి కూర్చుంటున్నాం.

అంతేకాదు పెద్దలు నువ్వు పూజ చేసినప్పుడు ఆ బాహ్యా అలంకారాలే కాదు, మనసును కూడా ఆ దైవం మీద కేంద్రీకరించాలి అంటారు. కాని నువ్వు కళ్ళు మూసుకొని ఆ దైవం మీద దృష్టి లేకుండా నీ సమస్యల మీద, నీ కోరికల మీద, నీ సంసారం మీద దృష్టి పెడుతున్నావు. అలా కళ్ళు మూసుకుని అన్నిటి మీద దృష్టి పెడితే దైవం మీద దృష్టి ఎక్కడ వున్నట్టు? దైవాన్ని ఆశ్రయించినట్లు ఎలా అవుతుంది?

అలాగే ధ్యానం చేసినప్పుడు దేని మీద దృష్టి వుండకూడదు, ఆత్మ మీదే దృష్టి వుండాలి. అదే నిజమైన భక్తి, అప్పుడే ఫలితాలు వస్తాయి. అంతేకానీ ఊరికే ఫలితాలు రమ్మంటే ఎలా వస్తాయి? మనసు వేరే విషయాల మీదకి వెళ్లకుండా ఆత్మ మీదే ఉంచాలంటే కొన్ని రోజులు కష్టపడాలి, అప్పుడే సాధిస్తారు. అలా పవిత్రంగా చేసే ధ్యానంలో మంచి ఫలితాలు మీరు పొందుతారు. అందుకే ధ్యానంలో పవిత్రత పెరుగుతుంది.

ఈ మార్గం దొరకడం, ఈ సాధన చేయడం ఎంత అదృష్టం. ఎందుచేతనంటే? ధ్యానంలో ఆ పరమాత్మతో గంటలు గంటలు అలా వుండిపోతాం. అందుకే ధ్యానం చేసిన వాళ్లు ఎన్నో సాధించారు, ఎంతో గొప్ప స్థితికి వెళ్లారు.

ఈ ప్రాపంచికమైనటువంటి ఏ ఆటంకాలు లేకుండా వుండడం కోసం ఎంతో మంది హిమాలయాలకి, ఆశ్రమాలకు, అరణ్యాలకు వెళ్ళారు.

కొండ గుహల్లో ఒక్కరే సాధన చేసేవారు, వాళ్లు గొప్ప యోగులు అయ్యారు, అన్నీ సాధించారు.

మనం ఆ రకంగా కాకపోయినా, మన పనులు చేసుకుంటూ, సంసారం చూసుకుంటూ, భుక్తికి లోటు లేకుండా సంపాదించుకుంటూ ఖాళీ దొరికినప్పుడల్లా ఈ పని చేసినప్పుడు మనం చేసే పనులు అనుకూలిస్తాయి.

ఎంతసేపూ మనకి ఆ భగవంతుడ్ని చేరుకోవాలని, ఆ భగవంతునితో ఉండాలని, ఆయన్ని సాక్షాత్కరించుకోవాలని ఆ ఉద్దేశ్యమే తప్ప ఇంకే ఉద్దేశ్యము లేదు. ఇంక లోటేముంటుందండి మనకి? ఏ ఇబ్బందులు వస్తాయి? ఏవైనా ఇంతకు ముందు చేసిన కర్మల ద్వారా వచ్చినా కూడా అవన్నీ ఆటోమేటిక్‌గా తొలగిపోతాయి. వాటి గురించి ఆలోచించక్కర్లేదు.

చాలా గొప్ప మార్గంలోకి వచ్చాము. ఇలా చేయడం వల్ల మన బుద్ధి బాగా వికసించి ఎన్నో జన్మలలో నేర్చుకునేది ఈ జన్మలో నేర్చుకుంటాం.

నేను కచ్చితంగా చెప్పగలను. ఇలాగే మనం తీవ్రాతి తీవ్రంగా ధ్యానం చేస్తూ, భగవంతుని మీద దృష్టి వుంచుతూ, భీమవరం క్లాసులు, ఇంకా ఎక్కడ క్లాసులు జరిగితే అక్కడ పాల్గొంటూ, మార్నింగ్ జూమ్‌లో పాల్గొంటూ, మన సమయాన్ని వృధా చేయకుండా, అశ్రద్ధ చేయకుండా చేస్తే ఎన్నో జన్మలలో నేర్చుకునేవి కచ్చితంగా ఈ జన్మలోనే విజయవంతంగా నేర్చుకోగలుగుతాం, ఎంతో ఎదుగుతాం, ఆత్మ ఉన్నతి పొందుతాం, ఆత్మకు ఎంతో లాభం కలుగుతుంది.

అందుచేత ఈ పవిత్రత అన్నది స్త్రీ జన్మలలో బాగా నేర్చుకుంటారు. ఈ లక్షణాలు ఎంత నేర్చుకుంటే అంత ఎదిగినట్టు లెక్క.

# "పురుష జన్మల్లో నేర్చుకునేవి"

మనం స్త్రీ జన్మలలో నేర్చుకునే కొన్ని ముఖ్య లక్షణాలు తెలుసుకున్నాం. ఇప్పుడు పురుష జన్మలలో నేర్చుకునే కొన్ని ముఖ్య లక్షణాలు తెలుసుకుందాం. పురుష జన్మలలో ముఖ్యంగా ధైర్యం, వీరత్వం, నిర్భయం, సాహసం, చొరవ అనే లక్షణాలు నేర్చుకుంటాం.

ఈ లక్షణాలన్నీ ఎందుకు నేర్చుకోవాలి అంటే? ఆత్మలమైన మనము మన లక్ష్యాన్ని సాధించడానికి. చాలామంది ధ్యానాన్ని రోగాలు తగ్గుతాయని, కోరికలు తీరతాయని, లేకపోతే అనుభవాలు వస్తాయని, ఏవో లాభాలు కలుగుతాయని చేస్తూ ఉంటారు.

కానీ మనందరం ఆ స్థాయి దాటిన వాళ్ళం, చాలా చివరి జన్మల్లోకి వచ్చాం. మన ఆశయం వేరే, మన లక్ష్యం వేరే. మీరు జీవితంలో మీ చుట్టూ ఉన్న వాళ్ళని గమనిస్తే 300, 350 జన్మల దాకా ఎవరికైనా సరే లక్ష్యాలు వేరువేరుగా ఉంటాయి.

చిన్నప్పటి నుంచి పాటలు పాడుతున్న వాళ్లు, ఆడవాళ్ళైతే ఎప్పటి కైనా సుశీల స్థాయికి ఎదగాలని, పురుషులైతే నేను ఘంటసాల లేదా ఎస్పీ బాలసుబ్రమణ్యం స్థాయికి ఎదగాలని అనుకుంటారు. ఆ స్థాయికి వస్తే వాళ్ల లక్ష్యం సాధించాను అనుకుంటారు.

అలాగే ఒకడు నేను మంచి క్రికెటర్ అవ్వాలంటాడు, ఇంకొకడు మంచి ఫుట్బాల్ ప్లేయర్ అవ్వాలంటాడు, మరొకడు నేను ఆటల్లో రికార్డులు బద్దలు కొట్టాలి అది నా ఆశయం అంటాడు.

కొంతమంది అందరికంటే ఎక్కువ డబ్బు సంపాదించాలని, జీవితం అంతా కూడా దానికోసమే పాటుపడుతూ ఉంటారు, అదే వాళ్ళ జీవిత లక్ష్యం అంటారు. ఇంకా కొంతమంది నేను కొన్ని వందల మందిని

పోషించగలగాలి, కొన్ని వందల మందికి బతుకు చూపించగలగాలి అదే నా ఆశయం, అదే నా లక్ష్యం, అదే నాకు తృప్తి అంటారు. మరి కొంతమంది ఎమ్మెల్యే లేదా మినిస్టర్ కావాలనుకుంటారు.

ఇలా చూస్తే కనుక ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క లక్ష్యం. ఇటువంటి లక్ష్యాలు 350 జన్మలు దాకా ఉంటాయి. తర్వాత తర్వాత వాళ్లకి "నేను ఈ దేహం కాదు నేను ఆత్మను" అన్నది తెలుస్తుంది. అప్పటిదాకా వారు నేను దేహం అనే భావంలో ఉన్నవారు.

ఆ భావనలో ఉన్నప్పుడు వారి లక్ష్యాలు వేరుగా వుంటాయి, కాని ఆత్మ అన్న భావంలో ఉన్నప్పుడు వారి లక్ష్యం మారిపోతుంది. ఆత్మ యొక్క లక్ష్యం పూర్ణాత్మ కావడమే, అందుచేత అది సాధించాలి అంటే పూర్ణజ్ఞాని కావాలి. ఆ జ్ఞానం పొందడం కోసమే ఇప్పుడు మనమంతా ధ్యానం చేస్తున్నాం.

అందుకే నేను ప్రతి ఒక్కరినీ భీమవరం మానొద్దు అని చెప్తున్నాను. ఆత్మైన మీరు మీ లక్ష్యం సాధించాలి అంటే కచ్చితంగా భీమవరం రావాలి. ధ్యానం చేయడానికి హిమాలయాలకు వెళ్లి ఎన్నో పాట్లు పడేవాళ్లు చాలామంది ఉన్నారు. హిమాలయాల్లో చేయడం అంటే మాటలా? వారి జీవితం అక్కడే అంకితం అయిపోతుంది. మనం వారంత కాకపోయినా కొంచెమైనా చేయాలిగా! సంసారంలోనే నిర్వాణం అని ఆచార్య నాగార్జున చెప్పిందే పత్రి గారు చెప్తూ ఉంటారు. ఆ పనే మనం ఇప్పుడు చేస్తున్నాము, సంసారం చూసుకుంటూ నిర్వాణం పొందే ప్రయత్నం చేస్తున్నాం.

మీ జీవితంలో సరైన దారిలో ప్రయాణించాలి అంటే కచ్చితంగా నేను ఆత్మ అని మీరు నిర్ధారణ చేసుకోవాలి. ఇది ఎవరు నిర్ధారణ చేసుకుంటారో వారు ఇంకో దాని మీద దృష్టి పెట్టరు, సంసారంలోనే వుంటారు కానీ లక్ష్యం మట్టుకు వదలరు.

గొప్ప గొప్ప సాధకులైన యోగులకి, మహర్షులకి సంసారాలు లేవా? ఆధ్యాత్మికతకు సంసారాలేమి అడ్డం కాదు, సుఖాలేమి అడ్డం కాదు, ఉన్నంతలో ఎంజాయ్ చెయ్యమంటారు పత్రి గారు. అందుచేత సంసారం చేస్తూ నీ సమయాన్ని వృధా చేయకుండా లక్ష్యాన్ని సాధించే ప్రయత్నం చేయాలి. మీరు సాధన చేస్తూ, ఈ మార్గంలో సేవలు చేయడానికి ప్రయత్నం చేయాలి.

పురుష జన్మలో నేర్చుకునే "ధైర్యం" అనే లక్షణం గురించి తెలుసుకుందాం

## 1) ధైర్యం

సహజంగా పురుషుడే ధైర్యాన్ని ప్రదర్శిస్తాడు. ఏ విషయంలోనైనా, ఏ పనిలోనైనా, ధైర్యంగా ముందుకు వెళ్తాడు. రాత్రి సమయాల్లో కానీ, ఒంటరిగా ఉన్నప్పుడు కానీ, గొడవల్లో కానీ పురుషుడే ధైర్యంగా ముందుకు వెళ్తాడు.

మనం కనుక పూర్వకాలంలో గమనించినట్లయితే, యుద్ధాల్లో పురుషులే పాల్గొనేవారు. కారణం అది పురుష లక్షణం. పురుషుడికే ఆ శక్తి, బలము, శరీర సౌష్టవం ఇవ్వబడ్డాయి. స్త్రీకి సున్నితత్వం, మృదుత్వం ఇవ్వబడ్డాయి.

గమనిస్తే ఒకే వయసు ఉన్న మగ పిల్లవాడు, ఆడపిల్ల యవ్వన దశకి వచ్చేదాకా ఇద్దరు సమానంగానే కనపడతారు. కానీ పెద్దమనిషి అయ్యాక, స్త్రీ మృదువుగా తయారయ్యి తన శరీర అవయవాలలో ఎన్నో మార్పులు కనపడతాయి. అలాగే పురుషుల్లో పురుష లక్షణాలు పెరుగు తుంటాయి. ఇది సృష్టిలో ఉన్న ఏర్పాటు.

మీరు గమనించినట్లయితే కుటుంబంలో తల్లి ఒక స్త్రీ అయినా కూడా మగ పిల్లవాడ్ని ప్రోత్సహిస్తుంది, ఆడపిల్లని నీకెందుకే? ఆడదానివి

అన్నిటికీ ఎగబడతావు, ఆడదానివి ఆడదానిలా ఉండు, ఆ గొడవలన్నీ నీకెందుకు? మాట్లాడితే బయటకు వెళ్తావు! అని తల్లే కూతురికి పిరికితనాన్ని నూరిపోస్తుంది.

మగ పిల్లవాడికి ఆ షరతులు ఉండవు. చిన్నప్పటి నుంచి అలా ధైర్యం ప్రోత్సహించడం వల్ల పురుషుడు ధైర్యాన్ని ప్రదర్శిస్తూ వుంటాడు. యుద్ధానికి వెళ్ళేటప్పుడు పురుషుడికి స్త్రీ వీర తిలకం దిద్ది ప్రోత్సహించి పంపిస్తుంది. అటువంటి యుద్ధాలు ఈ కాలంలో జరగకపోయినా గొడవలు జరుగుతూ ఉంటాయి. అప్పుడు ఇళ్లల్లో ఉన్న స్త్రీ ఏం చెప్తుందంటే? మన వాళ్ళ మీద ఎవరో దాడి చేస్తున్నారు మీరు వెళ్ళండి అని ప్రోత్సహిస్తుంది. అంతేకాదు గమనిస్తే రాత్రులు దొంగలు పడ్డ చప్పుడు అయినా, గిన్నెలు కింద పడిన చప్పుడు అయినా, తలుపులు చప్పుడు అయినా, ఏదైనా కూడా ముందుగా పురుషుడే ధైర్యంగా లేచి వెళ్తాడు. అలా ఎన్నో విషయాల్లో పురుషుడు ధైర్యాన్ని ప్రదర్శిస్తాడు.

ఎవడైనా ఆ గొడవలు మనకెందుకులే అన్నాడు అంటే వాడిలో కొంత భయం ఉన్నట్టే లెక్క. దొంగలు పడ్డప్పుడు కొందరు ముసుగు వేసుకుంటారు. అప్పుడు స్త్రీ అంటుంది ఏంటి నువ్వు మగాడివి కాదా? పౌరుషం లేదా? వెళ్ళు అని ధైర్యం చెబుతుంది. కొంతమంది పురుషులు అలా భయంతో ఉండడానికి కారణం వాళ్ళు ప్రారంభ జన్మల్లో ఉండడం. ఏదో కొన్ని నేర్చుకున్నారు కానీ ఈ ధైర్యం అనే లక్షణం ఇంకా నేర్చుకోలేదు. వారు అలా కొన్ని జన్మలు గడిచేసరికి ధైర్యం అన్నది సహజ లక్షణం అయిపోతుంది. అందుచేత ప్రారంభ జన్మల్లో స్త్రీ పురుషుడికి ధైర్యం చెప్పవలసి వస్తుంది. అలా స్త్రీ ధైర్యం చెబుతుంది అంటే ఆ స్త్రీ అంతకు ముందు జన్మలో పురుషుడిగా ధైర్యాన్ని నేర్చుకొని, ఇప్పుడు స్త్రీగా వచ్చింది. అందుకే ధైర్యం చెప్పగలుగుతుంది. ఇద్దరికీ ధైర్యం లేదనుకోండి! ఇద్దరు

తలుపులు గడి వేసుకొని వణికిపోతూ ఉంటారు.

అందుచేత ఈ ధైర్యాన్ని ప్రదర్శించగలిగే శక్తి, బలం సహజంగా పురుషుడికే ఇవ్వబడ్డాయి. ప్రారంభ జన్మల్లో పురుషుడు ధైర్యం ప్రదర్శించ లేకపోయినా మెల్లిమెల్లిగా ప్రక్క వారిని చూసి నేర్చుకుంటాడు. ధైర్యాన్ని ప్రదర్శిస్తాడు. చివరికి ఎంత ధైర్యాన్ని ప్రదర్శిస్తాడు అంటే? చావడానికి కూడా వెనకాడడు.

అంతేకాదు ధైర్యాన్ని ప్రదర్శించే వాడే నాయకుడు, రాజు అవుతాడు. వాడు ధైర్యం ప్రదర్శించటమే కాకుండా, అందర్నీ తన మాటలతో ఉత్తేజ పరిచి, ధైర్యం ప్రదర్శించేలా చేస్తాడు, అందర్నీ తన నాయకత్వంలో నడిపించ గలుగుతాడు. గమనిస్తే, ఏ విషయంలోనైనా ఎంతమంది వున్నారు అన్నది కాదు, ఎంత ధైర్యం ప్రదర్శించగలరు అన్నదాని మీదే విజయం ఆధారపడి ఉంది.

చూడండి జంతువుల్లో అత్యంత ధైర్యం కలిగిన జంతువు సింహం. సింహం ఎంత పెద్ద జంతువునైనా ధైర్యంగా ఎదుర్కొంటుంది. అది ఏనుగైనా సరే, ఒంటైనా సరే, జిరాఫీ అయినా సరే, ఖడ్గం మృగం అయినా సరే, మొసలి అయినా సరే, ఎంత పెద్ద జంతువైనా సరే వెనకాడదు, సంశయించదు, దానిమీద పడి చంపే ప్రయత్నం చేస్తుంది.

అందుకే మనం సినిమాలలో, యూట్యూబ్ లో చూస్తూ ఉంటాం. సింహం కనపడితే చాలు ఆవులు కానీ, మేకలు కానీ, దున్నలు కానీ, లేళ్లు కానీ, దుప్పులు కానీ, ఏవైనా సరే వందల కొద్ది ఉన్నా.. అవి మేత మేస్తున్నా సరే ఒక్కసారిగా అన్నీ పారిపోతాయి. బహిరంగ ప్రదేశాల్లో, అడవుల్లో అవి తింటూనే ఉంటాయి కానీ ఓ పక్క భయంతో శబ్దాలను గమనిస్తూ ఉంటాయి, ఏ అలికిడైనా, చిన్న శబ్దమైనా సరే పారిపోవడానికి సిద్ధంగా ఉంటాయి, భయం వాటి లక్షణం. ఆ జంతువులకి ధైర్యం పరిణామ

క్రమంలో వస్తుంది. తర్వాత జన్మలలో అక్కడ నేర్చుకోవాల్సినవి అక్కడ నేర్చుకుంటాయి. మరి అటువంటి ధైర్యం కలిగిన ఒక్క సింహం ఎన్నో వందల జంతువుల్ని పారిపోయేటట్టు చేస్తుంది.

దాని గాండ్రింపు అడవిని దద్దరిలేటట్టు చేస్తుంది. ఆ గాండ్రింపుకే జంతువులన్నీ చెల్లాచెదురైపోతాయి. గాండ్రింపుకే వాటి పరిస్థితి అలా వుంటే ఆ సింహమే కనిపిస్తే వాటి పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి!

ఒక 300 జన్మలు తీసుకున్న తర్వాత స్త్రీని గనుక గమనించినట్లైతే, పురుష లక్షణాలు కనబడుతూ ఉంటాయి. మాటలు, చేతలు అన్నీ కూడా పురుషుడిలా ప్రవర్తిస్తూ వుంటుంది. దానికి కారణం అంతకుముందు పురుష జన్మలు తీసుకొని ఆ లక్షణాలు సంతరించుకొని వచ్చింది. కానీ భర్త అన్ని జన్మలు తీసుకోలేదు, అందుకే ఆడదానిలాగే ప్రవర్తిస్తాడు, ఈవిడ ఎంత ధైర్యం చెప్పినా వాడికి ధైర్యం రాదు.

చూడండి మన పత్రి గారిని తీసుకుంటే, ఆయనకెంత ధైర్యం అంటే మన ఊహకు కూడా అందదు. ఆయన కోటీశ్వరుడు కాదు, కోట్లేమీ లేవు. అయినా సరే! ఎంత పెద్ద పెద్ద ప్రాజెక్టులు ప్రారంభింప చేశారు!

మొదట్లో అంటే 2004–2005 సంవత్సరంలో వాళ్ళ ఇంటికి వెళ్లాను. అక్కడికి పాల్ విజయ్ కుమార్ వైజాగ్ నుంచి వచ్చారు. ఎందుకు వచ్చారంటే? బెంగళూరులో ఒక ప్రాజెక్ట్ కోసం అన్నీ తిరిగి ఒక వాలీని సెలెక్ట్ చేసి పత్రి గారికి చెప్పారు. కానీ దాని రిజిస్ట్రేషన్ కి 15 లక్షల దాకా కావాలి అని చెప్పారు.

దానికోసం వైజాగ్ వెళ్లి అందరిని అడిగితే ఒక్కొక్కరు 25 వేలు ఇస్తానన్నారని పత్రీజీ గారికి చెప్తున్నాడు. అప్పుడు ఆయన జేబులో పైసా లేదు. ఇది ఎలా రిజిస్ట్రేషన్ చేయిస్తారు? ఆ ప్రాజెక్టు ఎలా కడతారు? ఏమిటి ఈయన ధైర్యం? అని అనుకున్నాను. అసలు ఆయన దాని గురించి

ఏమీ ఆలోచించలేదు. అప్పుడు నేను ఊరికినే అడిగాను, ఏమండీ! ఇది ఇప్పుడు మనకి అవసరమా అని.

అప్పుడు ఆయన "ఈడు వస్తే పెళ్లి చేసుకుంటారా? లేదా?" అని అడిగారు. చేసుకుంటారు అని అన్నాను. ఇప్పుడు మన సొసైటీలో దాని అవసరం వచ్చింది. అందుచేతే ఆ ప్రయత్నం మనం ఇప్పుడు చేస్తున్నాము అన్నారు. తరువాత దాన్ని స్టార్ట్ చేసి దానికొక రూపం తీసుకువచ్చారు.

అది పూర్తి అయిన తర్వాత కడ్తాల్ మొదలుపెట్టారు, దానికి ఒక రూపం తీసుకువచ్చారు. తర్వాత పేరవరం. వీటన్నిటికీ మించి పి.యం.సి. ఛానల్ స్టార్ట్ చేశారు. ఎందుచేతనంటే? అంతకముందు ఏదైనా టీవీ ఛానల్ వాళ్ళు నెలకో, రెండు నెలలకో, ఎక్కడైనా పత్రిగారిని ఇంటర్వ్యూ చేస్తే మనవాళ్లంతా ఈ ఛానల్ లో, ఆ టైంకి పత్రిగారి ఇంటర్వ్యూ వస్తుంది, అందరూ చూడండి అని మెసేజ్లు పెట్టుకుని ఎగబడి చూసేవారు. అలాంటిది మనమే టీవీ ఛానల్ ప్రారంభించడం అంటే మామూలు విషయం కాదు.

ఇది మన వల్ల ఎక్కడ అవుతుంది? కోట్ల ప్రాజెక్టు, ఎంతోమంది చానల్స్ నడపలేక ప్రారంభించి అమ్మేసిన వాళ్ళు ఉన్నారు అని సందేహించే వాళ్లు కానీ, పత్రిగారు మట్టుకు ఎక్కడా జడిసేవారు కాదు. మీకేం భయం లేదు, అవుతుంది అని ఎంతో ధైర్యం చెప్పేవారు. ఒక్కదానికే భయపడుతూ ఉంటే, ఆయన వెంటనే హిందీ, కన్నడ, తమిళ్, మరాఠీ ఛానల్ స్టార్ట్ చేశారు.

ఏం పర్వాలేదు డబ్బులు అవే వస్తాయి అని ధైర్యం చెప్పేవారు. మనం కూడా ధైర్యంగా "సత్యమార్గంలో" ముందుకి వెళ్ళినప్పుడు భయపడవలసిన పని లేదు. పి.ఎం.సి. యొక్క ఆశయం సత్యాన్ని వ్యాపింప చేయడం. అందుకే "ప్రతిక్షణం సత్య దర్శనం" అని మన ఎంబ్లెమ్ మీద

వ్రాయటం జరిగింది.

పత్రిగారు చెప్పారు "నీరు పల్లమెరుగు  సత్యం వ్యాప్తి నేరుగు" అని. అంటే నీరు ఎలా అయితే పల్లము వైపు పరుగెడుతుందో, సత్యం అలా వ్యాప్తి చెందుతూ ఉంటుంది. దాని అర్థం ఏమిటి? అసత్యం వ్యాపించదు, పెరగదు, ఎదగదు, వృద్ధి చెందదు. అదే సత్యమైతే మెల్లిగా అయినా అంతులేకుండా వృద్ధి చెందుతుంది.

అందుకే సత్యాన్ని పట్టుకోవాలి, సత్యాన్ని ఆశ్రయించాలి, సత్యంలోనే జీవించాలి అంటారు. వాడికి తిరుగు ఉండదు. అందుచేత మనం సత్యాన్ని ప్రోత్సహించినప్పుడు పి.ఎం.సి. అయినా సరే తిరుగు లేకుండా ఎదగగలదు. ప్రకృతికి అదే కావాలి, సత్యమే కావాలి.

సత్యం గురించి పాటు పడే వాళ్ళకి ప్రకృతి సహకారం లభిస్తుంది. పత్రి గారు చెప్పినట్టు ఏ టైంకి ఏది రావాలో, అదే వస్తుంది. "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఒక్కటే సత్యాన్ని ఆశ్రయించినట్టు. "శ్వాస మీద ధ్యాస" కాకుండా ఇంక దేన్ని ఆశ్రయించినా అంటే మాటను, పాటను, మ్యూజిక్‌ను, నామాన్ని, రూపాన్ని, మంత్రాన్ని, దేన్ని ఆశ్రయించినా అసత్యాన్ని ఆశ్రయించినట్టే.

ఎందుకంటే సృష్టిలో ఆత్మ ఒక్కటే సత్యం, ఆత్మ కానిది ఏదైనా అసత్యం. ఆత్మ నుంచి ఉద్భవించినది, ఆత్మచే సృష్టింపబడినది, ఏదైనా అసత్యమే. అసత్యాన్ని ఆశ్రయించినవాడికి అపజయమే, తాత్కాలికంగా విజయం కనబడుతుంది కానీ, అది అపజయమే. అందుకే నేను చెప్తున్నాను, సత్యమైన ఈ "శ్వాస మీద ధ్యాస" వదిలిపెట్టొద్దు. మనకి  తిరుగులేదు, చాలా గొప్పగా తయారవుతాం, గొప్పవాళ్ళం అవుతాం.

మనం మన ఊర్లో ఒక చిన్న ప్రాజెక్టు మొదలు పెట్టాలి అంటే మన వల్ల ఎక్కడ అవుతుంది? సాధ్యమా? అనుకుంటాం. కానీ "యద్భావం

తద్భవతి" అన్నట్టుగా నీ భావం అలాగే వుంటే అది అవ్వదు.

గమనిస్తే మిగతా వాళ్ళందరూ ఏం చేయగలం అని అనుకుంటారు. మనకు సాధ్యమా అని వెనకడుగు వేస్తారు. కానీ పత్రి గారు వెనకడుగు వేయరు. ధైర్యంగా ముందుకు వెళుతూ వుంటారు, చివరికి సాధిస్తారు కూడా. మరి ఎవరు ఇంత ధైర్యంగా ఉండగలరు?

ఎవరైతే చివరి జన్మల్లో ఉంటారో వారు వారి స్థాయిలో ధైర్యాన్ని ప్రదర్శిస్తారు. మనందరం కూడా ఆ ధైర్యాన్ని ప్రదర్శించాలి. మీరేమి క్రింద జన్మల్లో ఉన్నవారు కాదు. కానీ వీడియో ఆన్ చేయటానికి భయం, వీడియో ఆన్ చేసి ధ్యానం చేయటానికి భయం, జూమ్‌లో మాట్లాడటానికి భయం, ఏమవుతుంది? ఒకటో, రెండో ఫెయిల్యూర్ అవుతాయి, నష్టమేంటి?

ఒకటో రెండో ఫెయిల్యూర్ అవ్వకుండా, సక్సెస్ ఎలా అవుతుంది. డాక్టర్లు అయినా సరే, కొంతమందిని చంపితే కానీ, ఎక్స్‌పర్ట్ అవ్వడు. వాడు భయపడుతూ నేను ఈ ఆపరేషన్ చేస్తే వాడు చచ్చిపోతాడేమోని అనుకుంటే, ఎప్పటికీ ఎక్స్‌పర్ట్ కాలేడు. అందుకే ఏదైనా ధైర్యంగా ప్రారంభించాలి.

ప్రారంభంలో కొంతమందిని సీనియర్ మాస్టర్స్ అనేవారు. నాకు అసలు నచ్చేది కాదు. ఏంటి మనం సీనియర్ కాదా? వాళ్ళు చెప్పేదేమిటి? మనమూ చెప్పగలం. అసలు వాడు ఏం చెప్పాడు? వాడు చెప్పిందాంట్లో ఏముంది? అనే భావం లోనే ఉండేవాడ్ని.

"యద్భావం తద్భవతి" అని కృష్ణుడు చెప్పినట్టు, నా విషయంలో అది కరెక్ట్ అనిపించింది. నేనెందుకు సీనియర్ కాకూడదు అనే భావనలో ఉండేవాడిని. ఆ భావనే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది.

అందుచేత మనం స్త్రీలైనా, పురుషులైనా ధైర్యాన్ని సంతరించుకుని ఉన్నాము. నేను స్త్రీని కాబట్టి భయపడాలి అని అనుకోకండి. ప్రతి ఒక్కరు

ఆత్మలే. అందుచేత  స్త్రీ అయినా సరే కచ్చితంగా ధైర్యం ప్రదర్శించాలి.

యుద్ధాల్లో పాల్గొంటేనే ధైర్యం కాదు, ధ్యానం గురించి చెప్పడం, జ్ఞానం సంపాదించుకుని అన్నిచోట్లకు వెళ్లి జ్ఞానాన్ని బోధించడం ఇవన్నీ ఎంతో ధైర్యవంతమైన పనులు. ఈ పురుష జన్మల్లో నేర్చుకునే లక్షణం "ధైర్యం". ఇది ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి.

## 2) సాహసం

స్త్రీ అయినా పురుషుడైన ఆత్మే. ఇది ప్రతి ఒక్కళ్ళు మర్చిపోకూడదు. కాని స్త్రీ నేను స్త్రీ అనుకుంటుంది. పురుషుడు నేను పురుషుడు అనుకుంటాడు. నేను స్త్రీని కాదు, పురుషుడిని కాదు నేను ఆత్మను అన్న భావంలో  ప్రతి ఒక్కళ్ళు ఉండగలగాలి, ప్రతి క్షణం గుర్తుండాలి.

నేను ఈ దేహము, నేను స్త్రీ, నేను ఈ కులము, నేను భార్యను, నేను భర్తను ఇలాంటివన్నీ మీరు అనుకుంటే జీవించే విధానం ఒకరకంగా ఉంటుంది. నేను ఆత్మ కొన్ని పాఠాలు నేర్చుకోవడం కోసం ఇలా జన్మ తీసుకున్నాను అనుకుంటే జీవించే విధానం వేరేగా ఉంటుంది.

చూడండి సినిమాలో హీరోయిన్ భార్యగా నటిస్తుంది, హీరో భర్తగా నటిస్తాడు. వాళ్లకి లోపల కచ్చితంగా మేము నటిస్తున్నాము అనే భావం ఉంటుంది. ఆ సినిమా అయ్యేంత వరకే ఆవిడ నా భార్య. సినిమా అయ్యేంత వరకే ఆయన నా భర్త అనే భావంలోనే ఉంటారు.

అలాగే ఆత్మలమైన మనం కూడా కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి కొన్ని పాత్రలు పోషిస్తున్నాం. ఒక పాఠం 30 జన్మల్లో నేర్చుకోవచ్చు, 50 జన్మల్లో నేర్చుకోవచ్చు, లేదా రెండు మూడు జన్మల్లో నేర్చుకోవచ్చు. ఎన్ని తక్కువ జన్మల్లో నేర్చుకుంటే అన్ని జన్మలు తగ్గినట్టే.

"సాహసం" అనే లక్షణం పురుష జన్మల్లో నేర్చుకుంటారు. సహజంగా చాలామంది సాహసాలు చేస్తూ ఉంటారు. మనం యూట్యూబ్లో

రకరకాల సాహసాలు ప్రత్యక్షంగా చూస్తున్నాం.

కొంతమంది కొండలెక్కడం, పర్వతాలు ఎక్కడం, సముద్రాలు, ఈదడం, కొండమీద నుంచి దూకడం, క్రూర మృగాలు ఉన్నటువంటి కీకారణ్యాలలోకి వెళ్లడం, ఏమీ దొరకనటువంటి ఎడారులలోకి వెళ్లడం, అలాగే కారు, బైకు పందాలలో పాల్గొనడం, ఇంకా కొంతమంది ఇల్లు అంటుకున్నప్పుడు మంటల్లో దూకి లోపల ఉన్న వాళ్ళని రక్షించడం, విమానాల్లోంచి దూకడం ఇలాంటివన్నీ సాహసాలే.

ఇలాంటి సాహసాలు ఎవరైనా సరే కొన్ని జన్మల్లో చేస్తూ వుంటారు. ముఖ్యంగా రజోగుణంలో ఉన్నవారు ఇలాంటివి చేసి రికార్డ్ బద్దలు కొట్టాలని చూస్తూ వుంటారు. మీరు చూడండి, పత్రిగారు  ఏమని చెప్పారంటే? పాతాళభైరవి సినిమాలో ఆ మాంత్రికుడు "సాహసం చేయరా డింభకా కోరుకున్నది లభిస్తుంది" అని  చెప్పాడన్నారు. అంటే సాహసం ఎంత గొప్పదో మనము తెలుసుకోవచ్చు.

అంతే కాదు ఈ సినిమాలు చూసినప్పుడు మీరు గమనించినట్లయితే ఏ సినిమాలోనైనా ఎంతోకొంత సాహసం మనకి కనిపిస్తుంది. ఎందుకు ఉంటుంది అంటే? ఆ సాహసాలు ఉన్నప్పుడే ఎవరైనా ఆసక్తిగా ఆ సినిమాలు చూస్తూ వుంటారు, ఆ సాహసాలు ఉన్నప్పుడే ఆ సినిమాలకి ఎట్రాక్షన్ వస్తుంది.

అందుచేత  కేవలం తిండి, నిద్ర, సంసారం, ఇల్లు, వాకిలి ఇవే కాకుండా ఎవరైనా సరే కొన్ని మహత్తరమైన కార్యక్రమాలు చేపట్టాలి. కారణం ఏమిటంటే తిండి, నిద్ర, సంసారం కోసమే మనం భూమ్మీదకి రాలేదు. భూమి మీదకు వచ్చింది, కొన్ని మహత్తరమైన కార్యక్రమాలు చేయడానికి.

శరీరం నిలబడాలి కాబట్టి తిండి, నిద్ర, సంసారం, ఇల్లు ఇలాంటి

అవసరాలు తీర్చుకుంటూ.. ఎవరికి వీలైంది వాళ్ళు, ఎవరి స్థాయిలో వారు కొన్ని గొప్ప కార్యక్రమాలు చేస్తూ ఉండాలి. అంతే తప్ప హాయిగా తింటూ, ఎంజాయ్ చేస్తూ, హాయిగా పడుకుంటూ జీవితాన్ని గడిపేయడానికి కాదు. ఎందుచేతనంటే భూమిమీద నువ్వు నేర్చుకోవాల్సినవి నేర్చుకోకపోయినా, పొందవలసిన అనుభవాలు పొందకపోయినా మళ్ళీ భూమి మీదకు రావాలి.

చాలామంది జీవితంలో ఏ సమస్యలు, బాధలు, కష్టాలు, లేకుండా ఉంటే బాగుంటుందనుకుంటారు. జీవితం సాఫీగా ఉంటే ఇంక నేర్చుకునేది ఏముంది? అందుచేత ఖాళీగా కూర్చోకూడదు, కష్టపడాలి, ఏదో ఒకటి నేర్చుకోవాలి, ఏదో ఒక పని చేయాలి, పదిమందికి ఉపయోగపడే పనులు చేస్తూ ఉండాలి.

అలా జీవిస్తేనే అది సాహసోపేతమైన జీవితం అవుతుంది. అలాంటి వాటికోసం జీవితాన్ని అంకితం చేయాలి. అంతేకాదు తనకున్న దాంట్లో వీలైనంత ఇతరులకు ఇవ్వగలగడం కూడా సాహసకార్యమే. లోక కళ్యాణకరమైన కార్యాలకి, ఇతరులకు సేవ చేసే వాటికి వున్న దాంట్లో కొంత ఇవ్వడం కూడా సాహసమే!

ఇంకా కొంతమంది సాహసంలో పరాకాష్టకు చేరుకున్న వారు ఏం చేస్తారంటే? తమ గురించి కూడా చూసుకోరు, తమ సుఖాన్ని కూడా చూసుకోరు, తమకు ఉందా లేదా కూడా చూసుకోరు, ఇతరుల కోసమే తమ జీవితాన్ని అంకితం చేస్తారు. ఇలా జీవించడం కూడా ఒక సాహసోపేత మైన జీవితంమే. సాహసాలు సాధారణంగా రజోగుణంలో చేస్తారు.

అలా కొన్ని జన్మలయ్యాక మళ్ళీ సాత్వికగుణంలోకి వచ్చాక వారు చేసే సాహసాలు మారిపోతాయి. సాహసాలు అంటే ఎప్పుడూ కొండలెక్కి దూకడమే కాదు, వున్నదాంట్లో ఇతరులకు ఇవ్వగలగడం, తనకున్నవి అన్నీ త్యాగం చేయడం కూడా ఒక గొప్ప సాహసమే.

గాంధీ గారిని తీసుకుంటే ఆయన కోసం ఆయన జీవించలేదు, దేశం కోసం జీవించాడు. మదర్ థెరిసాను తీసుకుంటే ఆవిడ కూడా అంతే ఇతరుల కోసమే జీవించింది. ఇలాంటి మహాకార్యాలు ఎవరు చేస్తారో వారు జనాలోకం దాటి ఉర్ధ్వలోకమైన మహాలోకం చేరుకుంటారు.

సహజంగా లోకంలో ఉన్న పరిస్థితి ఏమిటంటే? పిల్లలు ఇలాంటివి ఏవైనా చూసి, వాటికి ప్రభావితమై వాళ్లు కూడా అలా చేయాలని చూస్తున్నప్పుడు ఆ తల్లిదండ్రులు, పెద్దలు వాళ్ళను నిరుత్సాహ పరుస్తారు. అది నీవల్ల కాదు, ఎందుకొచ్చిన గొడవ? నీ పని నువ్వు చూసుకోవచ్చుగా, హాయిగా ఉండొచ్చుగా అంటారు. అలాంటి పనులు చేసినప్పుడు నీకు ఏదైనా అయితే నీ సంసారం ఏమవుతుంది? నీ పిల్లలు ఏమవుతారు? నీకెందుకు అవన్నీ అని నిరుత్సాహపరుస్తారు.

కానీ పత్రి గారు  పిల్లల్ని నిరుత్సాహపరచకూడదని చెప్తూ వుంటారు... వాళ్ళకి నేర్పాలి. చీకట్లో వెళ్లమని చెప్పాలి, స్మశానానికి తీసుకువెళ్లాలి, ఏ పనైనా సరే భయపెట్టకూడదు,  భయాన్ని నేర్పకూడదు, అప్పుడే వాళ్ళు గొప్ప కార్యాలు చేస్తారు.

ప్రతి మానవుడు ఏదో ఒక ఉదాత్తమైన, ఉన్నతమైన కార్యక్రమాన్ని చేపట్టి, దాన్ని సాధించడం కోసమే పుడతాడు, భయపడుతూ జీవించడం కోసం కాదు. ఆత్మ యొక్క కోరిక కూడా సాహసం చేయడమే.

శరీరం యొక్క కోరిక ఆకలి తీర్చుకోవడం, ఆత్మ యొక్క కోరిక సాహసాలు చేయడం. అందుచేత నేను శరీరం అనుకున్నవాడు ఆకలి తీర్చుకోవడం కోసమే జీవిస్తూ ఉంటాడు. ఎప్పుడైతే నేను ఆత్మను అని తెలుసుకుంటాడో!  సాహసాలు చేయడం కోసం ప్రయత్నిస్తాడు, సాహసోపేతుడు అవుతాడు.

నేను ఆత్మ అన్నట్టుగా జీవించేవాళ్లకి సాహసం అన్నది సహజ

సిద్ధం అవుతుంది. ఎవరైతే ఆత్మజ్ఞానంలో ప్రవేశిస్తారో వాళ్లకి సాహసం అన్నది దినచర్య అయిపోతుంది, సహజమైపోతుంది. అందుచేత పత్రి గారు చిన్నపిల్లలకు చిన్నప్పటి నుండే ఈ సాహసం నేర్పించాలంటారు.

వాళ్లకి దెయ్యాలు ఉన్నాయి, భూతాలు ఉన్నాయి, బూచోడున్నాడు, దొంగోడున్నాడు అని భయపెట్టకూడదు. ఇలాంటివన్నీ చెప్పి పిరికి వాడిలా, ఎందుకూ పనికిరాని వాడిలా తయారు చేయకూడదు అంటారు. పిల్లలు అల్లరి చేస్తే వారిని సముదాయించడం కోసం భయపెట్టడం అన్నది తెలివి తక్కువతనం అంటారు.

స్మశానం వైపు తీసుకెళ్లాలి, అక్కడ కూడా వాళ్ళు స్వేచ్ఛగా తిరగాలి అలా భయం పోగొట్టాలి, నదిలో ఈదు అని ప్రోత్సహించాలి. జాగ్రత్తలు తీసుకుంటూనే సాహసాలు నేర్పించాలి. అందరు 'చీ' కొడుతున్నా, ఆత్మకు తోచింది, మన హృదయం చెప్పింది నిర్భయంగా చేసుకుంటూ పోవడమే 'సాహసం'.

ఆత్మ ఎప్పుడూ ధర్మమే చెప్తుంది. కనుక ఇతరులు ఏమనుకుంటారో అని లెక్కచేయకుండా మన హృదయంలో తోచింది నిర్భయంగా చేసుకుంటూ పోవడమే 'సాహసం'. ఎప్పుడైతే ఒకడు ఇలా చేస్తూ పోతాడో అది చూసి ఇంకొకడు చేస్తాడు. పత్రి గారు నిర్భయంగా చెప్పారు. పూజలు వద్దు, సత్యాన్ని పట్టుకో, ఏ నామము వద్దు, ఏ మంత్రము వద్దు, ఏ రూపము వద్దు, మాంసం వద్దు అని నిర్భయంగా చెప్పారు. అదే మనమూ నిర్భయంగా చేస్తున్నాం, చెప్తున్నాం.. అదే 'సాహసం'.

ఒకళ్ళు చేస్తే ఇంకొకళ్ళు అనుసరిస్తారు, గొప్పగా తయారవుతారు. గుర్తుపెట్టుకోండి సాహసానికి పైలోకాల్లో ఎన్నో మార్కులు వస్తాయి. నువ్వు భూమి మీద ఏ సాహసాలు చెయ్యకపోతే పై లోకాలకి వెళ్ళాక, ఎందుకు భూమి మీద ఉన్నప్పుడు ఏ సాహసమూ చేయలేదు? అని అడుగుతారు.

పిల్లలండీ, ఉద్యోగమండి, బరువు బాధ్యతలండి అని కథలన్నీ చెబితే చెప్పొచ్చు కానీ నీకు మార్కులు పడవు.

భీమవరం మూడు రోజులు క్లాసుకు రమ్మంటే ఎన్నో కారణాలు చెప్తారు. కాని ఆ జ్ఞానం సంపాదించుకుని, ఆత్మ స్థితిలో జీవిస్తే పైలోకాలకు వెళ్ళినప్పుడు ఎన్ని మార్కులు పడతాయి చెప్పండి. నువ్వు పరీక్ష రాస్తే నీకు మార్కులు పడతాయి, ప్రమోషన్ వస్తుంది, వ్రాయకపోతే మార్కులు పడవు, ప్రమోషన్ ఉండదు. జ్ఞానం సంపాదించకపోతే ఉన్నత లోకాలకు వెళ్లలేవు, ఉన్న లోకంలోనే ఉంటావు, ఇంకా దిగజారిపోతావు.

పత్రి గారు ఏం చెప్పారంటే? "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయడం అన్నిటికంటే గొప్ప సాహసం అన్నారు. మనసు నిర్మలం చేసుకోవడం, శుద్ధి చేసుకోవడం, మూడో కన్ను సంపాదించడం, గత జన్మలు చూసుకోవడం అత్యంత గొప్ప 'సాహసం' అన్నారు. అన్నిటికంటే అత్యంత గొప్ప సాహస కార్యక్రమం ఏది అంటే "శ్వాస మీద ధ్యాస" వుంచి ధ్యానం చేయడం. ఆ ధ్యానం ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకోవడం. అందుచేత ప్రతిరోజు ఈ గొప్ప సాహస కార్యక్రమం చేద్దాం ధ్యానంలో నిమగ్నులమవుదాం.

రజోగుణంలో ఉన్న వారి సాహసాలు ఒక రకంగా వుంటాయి. సాత్విక గుణంలో ఉన్న వారి సహసాలు ఇంకొకరకంగా వుంటాయి. శుద్ధ సాత్వికంలో ఉన్న వారి సాహసాలు ఇంకోరకంగా వుంటాయి. ఆత్మస్థితి పొందుతూ ఉంటే చేసే సాహసాలు ఇంకోరకంగా వుంటాయి. అంతేకాదు ఈ స్థితికి వచ్చేసరికి ఏం చేస్తారంటే సత్యాన్ని ఆశ్రయిస్తారు, సత్యాన్ని నిర్భయంగా బోధిస్తారు, సత్యంలో జీవిస్తూ వుంటారు. ఇది ఎలాంటి సాహసం అంటే? మొసళ్ళు ఉన్న సరస్సులో దిగడం లాంటిది. సత్యాన్ని ఆశ్రయించడం, సత్యాన్ని బోధించడం, సత్యంలో జీవించడం గొప్ప

సాహసోపేతమైన చర్య.

ఇటువంటి పనులు చేసే వారికి ప్రకృతి యొక్క సహాయం బాగా ఉంటుంది. ఇప్పుడు మనమంతా కూడా ఆ పనే చేస్తున్నాం, ఇది ఆత్మస్థితిలో ఉన్నవాళ్లు మాత్రమే అంత గొప్ప సాహస కార్యక్రమాలు చేయగలరు.

ప్రక్కవాళ్ళు ఏమనుకున్నా సరే వాళ్ళను లెక్కచేయకుండా, అనుకున్న పనిలో నిమగ్నం కావడమే ఒక మాస్టర్ యొక్క లక్ష్యం. ఇంకో విషయం తెలుసుకోవాలి, మనం సాహసాలు చేసినప్పుడు జయాప జయాలతో సంబంధం లేదు. అది సక్సెస్ అయ్యిందా? ఫెయిల్యూర్ అయ్యిందా? అన్నది అనవసరం. నువ్వు కార్యక్రమం పెట్టావు, లేకపోతే ఏదైనా క్లాస్కు వెళ్లావు, అక్కడ ఎంత మంది వచ్చారు? అన్నది అనవసరం, నువ్వు ఏంత గొప్ప పని చేసావా? లేదా? వెళ్లి చెప్పావా? లేదా? అన్నది కావాలి.

అవకాశం ఏదైనా వస్తే దాన్ని ఉపయోగించుకున్నావా? లేదా? అది ముఖ్యం. మరి మన వాళ్లంతా కూడా ఈ సాహసాన్ని అభ్యాసం చేస్తూనే ఉంటారు. అలాంటి వాళ్లు ఆధ్యాత్మికంగా ఎదుగుతారు, జీవితంలో ఎన్నో లాభాలు పొందుతారు, ఉన్నత లోకాలు చేరుకుంటారు.

## 3) చొరవ

పురుష జన్మలలో నేర్చుకునే వాటిలో ఒక ముఖ్యమైన లక్షణం ఏమిటి అంటే "చొరవ". సహజంగా భార్యాభర్తలలో అన్ని విషయాలలో ముందుగా చొరవ చూపించేది పురుషుడే! స్త్రీ ఎప్పుడు పురుషుడినే అనుసరిస్తూ వుంటుంది. అవసరమైన సందర్భాలలో సలహా ఇస్తుంది కానీ నిర్ణయం పురుషుడికే వదిలేస్తుంది.

ప్రయాణాలలో కానీ, బయటకు వెళ్లినప్పుడు కానీ, రాత్రి సమయాలలో కానీ, ఆఖరికి ఏదైనా గొడవలలో కానీ ముందుగా పురుషుడే

చొరవ చూపించి ముందుకు వెళ్తాడు. అన్ని విషయాలలో కూడా స్త్రీ పురుషుడి వెనకాల ఉండి సహకరిస్తుంది.

అందుచేత పురుష జన్మలలో చొరవ అనే లక్షణం బాగా నేర్చుకుంటాడు. ఏ లక్షణమైనా సరే ఒక్క జన్మలో రాదు. కొన్ని జన్మలు పడుతుంది. మీరు గనక గమనిస్తే ప్రకృతిలో పురుషునికి బలమైన, దృఢమైన శరీరం ఇవ్వబడింది. స్త్రీకి సున్నితమైన మృదువైన శరీరం ఇవ్వబడింది. అందుకే స్త్రీ సున్నితమైన శరీరంతో పురుషుని ఆధీనంలో జీవిస్తుంది. అలాగే పురుషుడు పై లక్షణాలన్నీ సంతరించుకోవాలి కాబట్టి సంసారంలో కూడా ఆదిపత్యం వహిస్తాడు, చొరవ చూపిస్తాడు. సంభోగ సమయంలో కూడా మీరు గమనించినట్లయితే ముందుగా పురుషుడే చొరవ చూపిస్తాడు, స్త్రీ కూడా అదే కోరుకుంటుంది.

స్త్రీ తన దేహాన్ని పురుషుడికి అప్పగిస్తుంది, పురుషుడు ఏమి చేసినా కాదనదు, ఒక్కొక్కసారి భరిస్తుంది కూడా! ఈ రకమైన ఏర్పాటు సహజంగా ప్రకృతిలో ఉంది. పురుషుడికి అంత దృఢమైన శరీరం ఉంది కాబట్టే ఈ సృష్టి కార్యం జరుగుతుంది, ఈ సృష్టి ఇలా కొనసాగుతుంది. పురుషుడు అల్పుడై, స్త్రీ దృఢమైనదైతే ఆ కార్యం జరగదు, అందుకే సృష్టిలో ఈ ఏర్పాటు ఉంది.

అందుకే మీరు చూడండి జంతువులలో కాని, పక్షులలో కాని, క్రిమి కీటక జాతిలో కాని, అలా ఏ జాతిలో తీసుకున్నా పురుష శరీరాలు స్త్రీజాతి శరీరం కంటే ఎంతో బలిష్టంగా, దృఢంగా ఉంటాయి. చూడండి మగ సింహానికి ఏంత దృఢమైన శరీరం ఉంటుంది? ఆడ సింహాన్ని శివంగి అంటారు, అది పురుష శరీరాన్ని చూసి దానికి లొంగిపోతుంది.

అంతేకాదు పురుషుడు స్త్రీని ఆకర్షించాలి కాబట్టి పురుష శరీరానికి సహజంగానే అందమైన శరీరం ఇవ్వబడుతుంది. అలాగే ఆడ నెమలిని

చూడండి, పురుష నెమలిని చూడండి ఎంత తేడా ఉంటుందో! పింఛము అన్నది మగ నెమలికే ఉంటుంది, ఆడ నెమలికి ఉండదు. మగ నెమలి ఆ పింఛం విప్పగానే ఆడ నెమలి ఆకర్షితురాలు అవుతుంది.

అలాగే మగ దుప్పికి అందమైన కొమ్ములు ఉంటాయి...ఆడ దుప్పికి కొమ్ములు ఉండవు. అలా మీరు ఏ జాతిని తీసుకున్నా ఆడ జీవి యొక్క శరీరం చాలా అల్పంగా ఉంటుంది, మగ జీవి యొక్క శరీరం చాలా దృఢంగా, బలంగా ఉంటుంది. ఈ సృష్టిలో సృష్టి కార్యం జరగడానికే ఈ ఏర్పాటు ఉంది, అందుకే ఈ సృష్టి ఇలా యుగయుగాల నుంచి కొనసాగుతుంది.

అందుకే ఏ రకమైన జీవి కూడా ఈ సృష్టిలో అంతరించిపోవట్లేదు, అలా కొనసాగుతూనే ఉంది. ఈ సృష్టి ఇలా ఇంకా కొన్ని కోట్ల సంవత్సరాలు కొనసాగదానికే సృష్టిరచన ఇలా ఉంది. సృష్టి కొనసాగాలంటే అన్నీ వుండాలి, అన్నింటి అవసరం వుంది, ఏది లేకపోయినా కొదవే! చూడండి ఆ సృష్టికర్త తన అపారమైన మేధస్సుతో ఏలాంటి గొప్ప సృష్టి చేశాడో గమనిస్తే ఆశ్చర్యమేస్తుంది.

ఆ భగవంతుడు అంటే సృష్టికర్త యొక్క మేధస్సు ఎంత గొప్పదో వివరించడానికి పురాణాలలో ఒక కథ చెబుతారు.

ఒకడు ఎండలో ప్రయాణిస్తు అలసిపోయాడు. ఆ ఎండ తీవ్రతతో చాలా నీరసించి పోయాడు, వాడు  కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ ప్రయాణించవచ్చు అని అనుకుని ఓ మర్రి చెట్టు కింద పడుకున్నాడు.

అలా పడుకుని పక్కకు చూస్తే మర్రి విత్తనాలు కనిపించాయి. వాడు అనుకున్నాడు భగవంతుడు  ఎంత తెలివి తక్కువ వాడు. ఇంత పెద్ద మర్రి చెట్టుకి ఇంత చిన్న చిన్న కాయలు ఇచ్చాడు. ఏదో నేల మీద పాకే గుమ్మడి పాదుకు పెద్ద పెద్ద కాయలు ఇచ్చాడు అని. వీడేదో తెలివైన

వాడిలాగా, భగవంతుడు తెలివి తక్కువ వాడిలా భావించాడు. అలా ఆలోచిస్తూ నిద్రపోయాడు.

నిద్రపోయి మూడు గంటల తర్వాత మెలకువ వచ్చి లేచి చూసేసరికి వాడి శరీరం మీద కొన్ని మర్రి కాయలు పడివున్నాయి, వాడు ఆశ్చర్యపోయాడు. అప్పుడు అనుకున్నాడు అమ్మ బాబోయ్! నేను భగవంతుని నిర్ణయం తప్పు అనుకున్నాను. ఆ పెద్ద వృక్షానికి గుమ్మడికాయంత కాయలు కనక పెట్టుంటే నా బ్రతుకు ఏమైపోయేది? ఈపాటికి చచ్చి వుండే వాడిని. భగవంతుడు ఏమి చేసినా అన్నీ ఆలోచించే చేస్తాడు, ఆయన చేసే పనులు అర్థం చేసుకునే శక్తి, తెలివి మనకు లేదు అని అనుకున్నాడు.

అందుచేత భగవంతుడు చేసిన ఏర్పాటు ఏది తప్పు కాదు. ఈ సృష్టి కొనసాగాలి అంటే? ఏ జీవికి ఏ లక్షణం ఉండాలో ఆ లక్షణాలన్నీ ఏర్పాటు చేశాడు. అందుచేత స్త్రీకి ఎలాంటి లక్షణాలు ఉండాలో అలాంటి లక్షణాలు ఇచ్చాడు, పురుషుడికి ఎలాంటి ఆకారం ఉండాలో అలాంటి ఆకారమే పురుషుడికి ఇవ్వడం జరిగింది.

మీరు గమనిస్తే ఏ జీవైనా, ఏ ప్రాణి అయినా సంభోగించాలంటే స్త్రీ జంతువు కింద ఉంటుంది, పురుష జంతువు దానితో సంభోగించడానికి దాని పైకి ఎక్కాలి. అంతేకాని రివర్స్ లో సృష్టికార్యం జరగదు, సృష్టి అక్కడితో ఆగిపోతుంది.

అంతే కాదు ఆ పురుష జంతువు బలిష్టంగా ఉంటుంది కాబట్టే స్త్రీ జంతువుని లోబరుచుకుని దానితో సంభోగించ గలుగుతుంది. లేకపోతే ఆ రతి కార్యం జరగదు. ఏ స్త్రీ జంతువైనా సరే ఆ రతి కార్యానికి సిద్ధపడి ఉండాలి. అలా రతి కార్యానికి సిద్ధపడినప్పుడు ఎదకు వచ్చింది అంటారు. అంటే పురుష జంతువుతో సంపర్కానికి సిద్ధమయ్యిందని లెక్క. అప్పుడు దాన్ని ఆ దున్న దగ్గరకో, ఆంబోతు దగ్గరకో తీసుకెళ్లి ఆ సంభోగం చేయిస్తారు,

ఆ తర్వాతే అది గర్భం ధరిస్తుంది.

గర్భం ధరించిన మరల ఆరు మాసాల తర్వాత ఎదకు వస్తుంది, అంటే సంభోగానికి సిద్ధమవుతుంది. అందుకే అది ఒక్కసారి సంభోగం చేసిన తర్వాత మళ్ళీ అడగదు, కోరదు అలా వుండిపోతుంది, కొన్ని జంతువులు సంవత్సరం ఉంటాయి. కాని మానవులలో అయితే నెలకు ఒకసారి స్త్రీలలో ఋతు సమయము అంటారు.

నాకు ఒక సందేహం ఉండేది, మానవులు ప్రతిరోజు సంభోగ సుఖం కోరుకుంటారు కదా? కాని జంతువులకి ఆరు మాసాలకో, ఏడాదికో ఒక్కసారే ఆ సుఖం పొందే ఏర్పాటు భగవంతుడు చేశాడు కదా? ఎందుకు అనేటటువంటి సందేహం నాకు వచ్చేది. కానీ బాగా ఆలోచిస్తే వేటికి ఎలాగ ఉండాలో వాటికి అలాగే ఏర్పాటు చేస్తాడు అని అర్థమయ్యింది.

అందుచేత భగవంతుడు ఏది చేసినా దానికి ఒక కారణం వుంటుంది, కారణం లేకుండా ఏదీ జరగదు. చూడండి కోళ్లు, గొర్రెలను గమనిస్తే పదేసి గొర్రెలకు ఒక పోటేలును పెంచుతూ ఉంటారు. అలాగే పదేసి కోళ్ళకు ఒక పుంజును పెంచుతారు.

అంతేకాని పదికి పది ఉంటే స్త్రీ పక్షులు కానీ, ఆడ జంతువులు కానీ చచ్చి ఊరుకుంటాయి. అన్నీ దాని మీద పడితే అవి తట్టుకోలేవు, ఇవన్నీ భగవంతుడు ఆలోచించి చేసినవే. ఇవన్నీ గమనించడం ద్వారా ప్రకృతిలో ఎన్నో నేర్చుకుంటాము.

అందుచేత భగవంతుని సృష్టిలో నేర్చుకునేవి ఎన్నో వున్నాయి. నాకు చిన్నప్పుడు గొంగళి పురుగులు చూస్తే చాలా చిరాకుగా వుండేది. భగవంతుడు ఎందుకు వీటిని సృష్టించాడు? ఈ గొంగళి పురుగులు ఆకులను తెల్లారే సరికి తినేస్తాయి అనుకునేవాడిని. ఒక గొయ్యి తవ్వి వాటన్నిటిని అందులో వేసి పూడ్చేవాడిని. కాని ఇందులోకి వచ్చిన తర్వాత అర్థమైంది,

అవి అంత నాశనం చేసినా... ఆ తర్వాత అది  గూడు కట్టుకుని ఒక సీతాకోకచిలుకలా బయటకు వస్తుందని.

అంత చిరాకుగా ఉండేటటువంటి ఆ గొంగళి పురుగు సీతాకోక చిలుకలా ఎంతో ఆకర్షణీయంగా మారుతుంది. ఈ గొంగళి పురుగు వల్ల ఏమీ ఉపయోగం లేదా? అని ఆలోచిస్తే  అర్థమయ్యింది. ఆ సీతాకోకచిలుక పువ్వులన్నిటి మీద వాలి పరపరాగ సంపర్కం చేస్తుంది, అంటే ఆ పురుష పువ్వుల మీద ఉన్న పుప్పొడిని ఆ స్త్రీ పువ్వుల మీదకు చేరవేసి ఫలదీకరణానికి సహాయం చేస్తుంది. దానివల్ల మనకు  పువ్వులు, కాయలు, పండ్లు వస్తున్నాయి,  పంటలు పండుతున్నాయి. వాటిని తినే మానవులు బ్రతుకు తున్నారు.  ఆ గొంగళి పురుగులు లేకపోతే ఇది జరగదు, ఈ పంటలు రావు, మానవ మనుగడ వుండదు.

అందుచేత వృక్షాలలో కూడా స్త్రీ పురుష భేదం మనకు కనిపిస్తుంది. కొబ్బరి చెట్టు అయితే ఒకటే చెట్టు ఉంటుంది. తాడి చెట్టు అయితే ఆడతాడి, మగతాడి అని రెండు రకాలుగా ఉంటాయి. ఆడ తాడి చెట్టుకు తాటి పండ్లు తయారవుతాయి. మగ దాంట్లో ఏమీ ఉండదు ఉత్తి పువ్వులే ఉంటాయి.

ఇలా వృక్షజాతిని, జంతు జాతిని ప్రతి దాన్ని గమనిస్తే భగవంతుడి సృష్టి ఎంత గొప్పగా వుంటుందో, ఎంత ఆశ్చర్యకరంగా ఉంటుందో మనకు అర్థం అవుతుంది. బుద్ధి వికసించే కొద్దీ ఎన్నో ఆలోచిస్తాం, వాటి నుంచి ఎన్నో నేర్చుకుంటాం. లేకపోతే ఖానా, పీనా, సోనా ఈ మూడు ఉంటే చాలు దానికోసమే జీవితం అన్నట్టు ఉంటాం.

బుద్ధి ఎంత ఎక్కువ పెరిగితే మీరు జీవితంలో అంత ఎక్కువ నేర్చుకుంటారు, అనుభవాలు కూడా పొందుతుంటారు, అందుకే బుద్ధి బాగా వికసింప చేసుకోవాలి అంటాను. జీవితం అన్నది సంసారం

చేయడానికి, పిల్లలను కనడానికి, వాళ్లని పెంచడానికే కాదు, ఆ సృష్టిని చూసి ఎన్నో నేర్చు కోవడానికి,

నేర్చుకుని కో(క్రియేటర్ అయిన తర్వాత సృష్టి చేయడానికి, సృష్టి కార్యంలో పాల్గొనడానికి.

ఆత్మలమైన మనము భూమి మీదకు వచ్చింది ఎంతో జ్ఞానం పెంచుకోవడానికి. దైవ స్థితి పొందాలి అంటే అన్ని లక్షణాలు ఉండాలి కదా? పూర్ణత్వం పొందాలి కదా? దానికి ఎంతో ఆలోచించాలి, అప్పుడే నేర్చుకుంటాం. అందుకే జరిగే ప్రతి విషయం మీద సందేహాలు రావాలి, మీకు సందేహం వస్తేనే సమాధానం దొరుకుతుంది, సమాధానం దొరికితేనే మీరు నేర్చుకోగలుగుతారు.

ఆ స్థితిలో ఉన్న పెద్దలు మనకు అర్థమయ్యే రీతిలో ఎన్నో కథలు కూడా వ్రాశారు. మనం కూడా కాబోయే పెద్దలమే, మన తరవాత తరాల వాళ్ళు మనల్ని ఉదాహరణగా చెప్పుకుంటారు, అలా చెప్పుకోవాలి. ఎప్పుడో వచ్చిన వేమన గురించి, వీరబ్రహ్మేంద్రస్వామి గురించి చెప్పుకుంటున్నామా? లేదా? ఇప్పుడు పత్రిగారిని చెప్పుకుంటున్నాంకదా? ఇది సృష్టిలో సహజం, ఎప్పుడూ వాళ్ళే ఉండరు, మరల కొత్త వారు వస్తారు. సృష్టిలో మార్పు అన్నది సహజం అలా అన్ని మారుతూనే ఉంటాయి ఏది శాశ్వతంగా అలా ఉండిపోవు.

క్రొత్త వాళ్ళం అయిన మనం కూడా ఆ రకమైన స్థితికి ఎదగాలి. దానికోసమే ఈ జన్మ. అందుచేత తప్పనిసరిగా అర్థం చేసుకోండి, చొరవ అన్నది పురుష జన్మలలో నేర్చుకునే ఒక గొప్ప లక్షణం అది ఏ జాతిలోనైనా సరే ఉంటుంది. గొడవలకి వెళ్ళినా చొరవ చూపించాలి, సంభోగంలో చొరవ చూపించాలి, చీకట్లోనైనా చొరవ చూపించాలి ఇది పురుష లక్షణం.

## 4) వీరత్వం

ఏ రకమైన జన్మల్లో నేర్చుకున్నా ఆత్మే. ఆత్మే అన్ని రకాల అనుభవాలు పొందాలి. అందుచేత స్త్రీ జన్మ అనేకంటే స్త్రీ శరీరంతో ఆత్మ కొన్ని నేర్చుకుంటూ ఉంటుంది. పురుష శరీరంతో ఆత్మ కొన్ని నేర్చుకుంటూ వుంటుంది. అది తెలుసుకోవాలి. అలా నేర్చుకోవడానికి అనుకూలమైన శరీరం తీసుకుంటుంది.

స్త్రీ శరీరం చాలా సున్నితంగా ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే చాలా బలహీనంగా ఉంటుంది, పురుషుడు ఎత్తినంత బరువులు స్త్రీ ఎత్తలేదు.

పురుషుడి శరీరం చూస్తే చాలా సౌష్టవంగా, బలిష్టంగా ఉంటుంది, ఆకారం కూడా చాలా పెద్దగా ఉంటుంది. ఒకే తల్లీ తండ్రికే పుట్టిన వాళ్లైనా.. ఆడపిల్ల సున్నితంగా తయారవుతుంది, అదే మగ పిల్లాడైతే సౌష్టవంగా తయారవుతాడు. మీరు ఇంకా గమనిస్తే స్త్రీ ఎన్ని ఎక్సర్సైజులు చేసినా, ఎన్ని వెయిట్ లిఫ్టింగులు చేసినా, ఎన్ని చేసినా, ఎంత తిన్నా కండలు రావు, పురుషుడికే వస్తాయి. అందుకే పురుషులు అంత దృఢంగ ఉంటారు.

"వీరత్వం" అనే లక్షణం పురుష శరీరంతో నేర్చుకుంటారు. ఎవరిని వీరుడంటారంటే? ప్రాణాలు కూడా లెక్కచేయకుండా తెగించి పోరాడే వాడిని వీరుడు అంటారు. వీరుడు అనుకున్నది సాధించాలి, విజయం సాధించాలి అనే భావంతోనే ఉంటాడు. అందుచేతే పూర్వకాలం నుంచి చూస్తే యుద్ధాల్లో బలిష్టమైనటువంటి పురుషులే పాల్గొనేవారు. ఎవరికైనా ఏది చేయాలన్నా కూడా బలమైన శరీరం ఉండాలి. కాని స్త్రీలని బలం అవసరం లేని పనుల్లో ఉంచుతారు.

యుద్ధాల్లో పోరాడే వాడిని వీరుడు అంటారు, ప్రాణం పోతుందని భయపడి పారిపోయే వాడిని పిరికివాడు అంటారు. ఒకరకంగా జీవితం

కూడా ఒక యుద్ధమే, ఆ యుద్ధం లోనే కాదు జీవిత యుద్ధంలో కూడా పోరాడే వాడే వీరుడు. ఎటువంటి పరిస్థితులలో అయినా సరే, ఎన్ని రకాల కష్టాలు ఎదురైనా వెనకడుగు వెయ్యకూడదు, భయపడకూడదు, పిరికివాడిలా ఆత్మహత్యలు చేసుకోకూడదు, చేసుకుంటే వారిలో వీరత్వం లేనట్టే.

కొంతమంది కొన్ని కష్టాలు వచ్చేసరికే దడదడ లాడిపోతారు. ఇంకెందుకు ఈ బ్రతుకు, బ్రతికే కంటే చచ్చిపోతే మేలు అంటారు, ఇలాంటి వాళ్ళని వీరులు అనరు. ఆ వీరత్వం ఉన్నవాడు జీవిత సమరంలో కూడా చివరి వరకు ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొంటూనే ఉంటాడు, దాంట్లో అనుభవం సంపాదిస్తాడు. వాడికి కొంచెం జ్ఞానం ఉంటే ఇవన్నీ నేను తెచ్చుకున్నవే, కావాలని నేను ఎంచుకున్నవే, వీటికి నేను భయపడకూడదు, పారిపోకూడదు అని వాటిని ఎదుర్కొంటాడు.

ఎవరైతే ఈ సమస్యలు ఎదుర్కోలేక పిరికివారిలా ఆత్మహత్య చేసుకుంటారో అలాంటి వారికి వీరత్వం అనే పాఠం నేర్పడానికి ప్రకృతి ఇంకా దారుణమైన, కష్టమైన జన్మనిస్తుంది. అనుభవిస్తానని, భరిస్తానని ఎంచుకుని వచ్చి ఇప్పుడు పారిపోదామని చూస్తే, మాట తప్పితే మళ్లీ అదే పరిస్థితులతో జన్మ తీసుకుంటారు. అంటే ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యలు చేసుకున్న వారికి మళ్ళీ అవే ఆర్థిక సమస్యలతో జన్మ వస్తుంది.

మామూలుగా అయితే జన్మలు వెంటనే వస్తాయో, రావో తెలీదు కానీ ఆత్మహత్యలు చేసుకున్న వాళ్లు మాత్రం గోడకి కొట్టిన బంతిలా వెంటనే వచ్చేస్తారు. వారు ఆ పాఠం నేర్చుకోవడం పూర్తి చెయ్యలేదు. అది పూర్తి చేయడానికి అదే రకమైన సమస్యలతో ఇంకొక చోట పుడతారు, ఇంకో రకమైన కుటుంబంలో పుడతారు, కాని సమస్య మటుకు అలాంటిదే వస్తుంది, ఇంకా కొంచెం ఎక్కువే వస్తుంది, భరించవలసిందే. అందుచేత పత్రి గారు ఎన్నోసార్లు చెప్పారు, ఎటువంటి పరిస్థితులలో కూడా ఆత్మహత్య

చేసుకోవద్దు అని.

ఆత్మహత్య అంటే తప్పించుకున్నట్టు కాదు. "పెనం మీద ఉన్న రొట్టె పొయ్యిలో పడినట్టే". చాలామంది మామూలు జీవితంలో శిక్ష పడితే లంచాలు ఇచ్చి తప్పించుకోవచ్చు అనుకుంటారు. కానీ ఆ కనిపించని ప్రభుత్వంలో ఎటువంటి పరిస్థితులలో తప్పించుకోవడానికి లేదు.

మామూలు జైల్లో నుండి తప్పించుకుంటే  పట్టుకొచ్చి మళ్లీ జైల్లో వేసి, ఇంకా ఎక్కువ శిక్ష వేసి, వెళ్ళడానికి వీలు లేకుండా చీకటి కొట్లో పెట్టి గొలుసుతో బంధిస్తారు. ఈ భూమి అనే జైలు నుండి కూడా శిక్ష అనుభవించకుండా తప్పించుకోవాలని చూస్తే వాడ్ని ప్రకృతి  పారిపోతావా! వెధవా అని చెప్పి మళ్ళీ తీసుకొచ్చి ఇంకా దారుణమైనటువంటి జన్మ వాడికి ఇస్తుంది.

అందుచేత ఎటువంటి పరిస్థితులలో ఆత్మహత్య చేసుకోకూడదు అంటారు. కష్టాలు వచ్చిన వాళ్లు ఎదుర్కొనే శక్తి ,  ధైర్యము కావాలంటే సాధన బాగా చేయాలి. అందుకే భీమవరం మూడు రోజుల క్లాసుకి వచ్చినట్లయితే సాధనలో పట్టు వస్తుంది. మీరు కొన్ని నెలలు వరుసగా వచ్చేసరికి మీకు తెలియకుండానే ఎంతో శక్తి పెంచుకుంటారు. శక్తి వున్నవారు లెక్కచేయకుండా అన్నిటినీ తట్టుకుంటారు, ఎవరికైనా కష్టాలు వస్తాయి, రాకుండా ఉండవు, కాని అది కష్టం కిందే అనిపించదు.

ఆ శక్తి లేకపోతే విలవిల లాడిపోతారు. బాబోయ్ జీవితం ఇలా అయిపోయిందే అనుకుంటారు. నా వల్ల కాదు నేను చచ్చిపోతాను, భగవంతుడు అన్యాయం చేశాడు, నేనేం తప్పు చేశాను? అని ఆలోచిస్తూ ఉంటారు.

కష్టం వచ్చినప్పుడు ఆత్మహత్య చేసుకోవడం కాదు వీరుడిలా వీరత్వం ప్రదర్శించాలి. సత్యాన్ని ఆచరించడానికి కూడా వీరత్వం

వుండాల్సిందే! సత్యం ఆచరించడం అంటే సామాన్యమైన విషయం కాదు. సత్యాన్ని చెప్పడానికి, సత్యం మాట్లాడడానికి, సత్యం బోధించడానికి, సత్యం ఆచరించడానికి, సత్యములో జీవించడానికి, సత్యాన్ని స్థాపించడానికి భయపడకూడదు, పారిపోకూడదు, వీరుడిలా నిలబడాలి, ఎన్నో విమర్శలు వస్తాయి, ఎంత విమర్శించినా చలించిపోకూడదు.

మనం గమనిస్తే పత్రి గారు లోకంలో ఆచరించే దానికి విరుద్ధమైనవే చెప్పేవారు. చాలామంది ఆయన్ని విమర్శించేవారు, అయినా ఆయనేమీ జడవలేదు. ఈయనకి ఎంత ధైర్యం అని అనుకునేవాడిని, ఆయన ఎటువంటి సభలోనైనా, ఎటువంటి వాళ్ళు ఉన్నా కూడా ఉన్నది ఉన్నట్టు చెప్పేవారు.

పత్రి గారు విగ్రహం దేవుడు కాదు అన్నాడు, ఎంత ధైర్యం వుండాలండి? దానికోసం ఎన్నో చోట్ల గొడవలు జరిగాయి. వీరుడిలా నిలబడ్డారు, నాకు ఎందుకొచ్చిన గొడవ అని పారిపోలేదు. ఆయన అలా చెప్పుకుంటూనే వెళ్లిపోయాడు, అది వీరత్వం అంటే.

పత్రిగారు మాంసం వద్దు అని చెప్పారు. కాని అందరూ మాంసం తినేవాళ్లే, ఎంతోమంది ఎదురు తిరిగేవాళ్లు. ఏ ఎవరూ తినట్లేదా? ఆ మాంసం దుకాణాల వాళ్లు, ఈ కోళ్ల ఫారమ్‌ల వాళ్ళు, గొర్రెలు, మేకలు పెంచే వాళ్ళందరూ ఏమైపోవాలి? ఇలా చెప్తాడేంటి ఈయన? అని చెప్పి విమర్శించేవారు. అయినా సరే ఆయన ఏమీ జడవలేదు. వెనకడుగు వేయలేదు.

నేను ఒక పల్లెటూరికి వెళ్లాను అక్కడ కూడా బాగా మాంసాహారం తినేవాళ్ళే ఉన్నారు. ఈ విషయం చెప్తే ఏదో కొంతమంది ఊరుకున్నారు. కానీ ఒకడు ఏకంగా కొట్టడానికి మీదకి వచ్చేసాడు. ఇక్కడికి వచ్చి నువ్వు చెప్పే పాఠాలు ఇవా? మేము బ్రతికేదే వాటిమీద. నువ్వు వద్దంటావేంటి?

మేము ఎలా బ్రతకాలి? తినకుండా ఎవడున్నాడు? తినకపోతే ఎలా బ్రతుకుతాడు? ఇలా అడ్డకోలుగా మాట్లాడడం మొదలుపెట్టాడు. నేను చెప్పేది చెప్పాను, నీకు ఇష్టమైతే ఆచరించు, నీకు అర్థం కాకపోతే నేనేం చేయను అంటే! మొత్తం మీద సర్దుకున్నాడు.

ఇలాంటివన్నీ చూసే నేను ఎక్కడికి వెళ్లినా మన మాస్టర్లే చెప్పేవారు. ఏవండీ ఇక్కడంతా మాంసాహారం తినేవాళ్లు ఎక్కువ. ధ్యానం చెప్పండి, మెల్లిమెల్లిగా వాళ్లే మానేస్తారు అని. నాకు తెలుసు అసలు సత్యం చెప్పకపోతే మనం అక్కడికి వెళ్లడం కూడా దండగే. అలా చేస్తే చాలా పిరికివాడి కింద లెక్క, వారికి వీరత్వం లేనట్టే.

అంతేకాదు మనకి అస్తమాను అవకాశం రాదు, అవకాశం వచ్చినప్పుడు ఒక 100 మందికో, 50 మందికో చెప్తే అందులో ఒక్కడు మారినా చాలు. తరువాత వారు క్లాస్ పెడితే పెట్టాడు లేకపోతే లేదు, వచ్చిన అవకాశాన్ని వదిలే వాడిని కాదు, అదే చెప్పేవాడిని.

అలాగే పత్రిగారు మందులు వద్దు అంటారు. దానికి కూడా ఎంతోమంది డాక్టర్లు ఆయన్ని విమర్శించారు. మందులు లేకుండా ఎలా కుదురుతుంది అని అనేవాళ్ళు. పత్రిగారు చెప్పేవన్నీ విరుద్ధంగానే వుండేవి, కానీ అన్నీ సత్యాలే. ఆయన నువ్వు దేహం కాదు అంటారు, ఇదీ విచిత్రమే. అందరూ నేను దేహం అనుకుంటే, ఈయన దేహం నువ్వు కాదు అంటాడు, అలా సత్యం చెప్పడానికి చాలా ధైర్యం ఉండాలి.

అలాగే ఇప్పుడు అందరూ సత్యమార్గమైన “శ్వాస మీద ధ్యాస” వదిలేసి అసత్యమార్గమైన “గైడింగ్” పట్టుకున్నారు, అందరూ గైడింగ్ లోకే వెళ్ళిపోయారు. అసత్యం ఆకర్షించినంతగా, సత్యం ఆకర్షించదు.

అది సత్యం కాదు అని చెప్పడానికి ఎంతో ధైర్యం వుండాలి? ఆ పరిస్థితి ఎదుర్కోవాలి అంటే ఎంతో వీరత్వం ప్రదర్శించాలి. కాని నేను

ఎక్కడా జడవలేదు, భయపడలేదు, వెనక్కి తగ్గలేదు. పోనీలే ఎవడి గొడవ వాడు పడతాడు మనకెందుకులే అని నేనేమీ రాజీ పడలేదు, నిక్కచ్చిగా చెప్పేవాడిని.

దానిమీద పుస్తకం కూడా వ్రాశాను. చాలామంది "శ్వాస మీద ధ్యాస" సరైనదని ఒప్పుకుంటున్నారు. కాని కొత్తవాళ్ల కోసం అని సర్ది చెప్పుకుంటున్నారు.

బుద్ధుడు 'అనాపానసతి' అన్నాడు, దానినే పత్రీజీ 'శ్వాస మీద ధ్యాస' అన్నారు. మన జూమ్ లోకి వచ్చే వాళ్ళందరూ బుద్ధిస్థితిలో వున్నవాళ్లే. ఈ బుద్ధి స్థితిలో ఉన్నవాళ్లు వీరత్వాన్ని , ధైర్యాన్ని ప్రదర్శిస్తారు.

కానీ బుద్ధి స్థితిలో నుంచి ఆత్మస్థితిలోకి రాగలిగితే ఇంకా ఎన్నో నేర్చుకుంటారు. వీరత్వాన్ని, ధైర్యాన్ని ప్రదర్శిస్తారు, ఓర్పు, నేర్పు నేర్చుకుంటారు, వారికి రాని గుణమంటూ ఉండదు. ఆత్మ అంటే భగవంతుడు, ఆయనకి సకల సద్గుణాలు ఉంటాయి, సకల లక్షణాలు వుంటాయి. సాధన తీవ్రంగా చేసే కొద్దీ ఆ లక్షణాలన్నీ వస్తూ ఉంటాయి, వాడు ఏదైనా చేస్తాడు, ఏదైనా సాధిస్తాడు.

ఈ వీరత్వం అన్నది పురుష శరీరంతో ఎక్కువగా నేర్చుకుంటారు. సుమారు ఒక స్త్రీ శరీరంతో 250 జన్మలు, పురుష శరీరంతో 250 జన్మలు తీసుకుని ఒక్కొక్క లక్షణం నేర్చుకుంటారు. అందుచేత జీవిత ప్రణాళికలో కూడా నేర్చుకోవలసిన దానిని బట్టే ఈ జన్మ కూడా వుంటుంది, అందుచేత సత్యం చెప్పడానికి వెనకాడకండి.

## 5) నిర్భయం

పురుష జన్మలలో నేర్చుకునే ఇంకొక లక్షణం "నిర్భయం". ఒక జన్మలో కాకపోయినా కొన్ని జన్మల్లో నిర్భయంగా జీవించడం నేర్చుకుంటారు. ఎక్కడికి వెళ్ళినా, ఎక్కడ ఉన్నా పురుషుడు నిర్భయంగా ఉంటాడు. అందుకే

పురుషుడు ఎక్కడికైనా సరే ఒంటరిగానైనా వెళ్తాడు. అదే స్త్రీలకైతే ఎవరైనా సహాయం రావాలి. స్త్రీల శరీరం బలహీనమైనది, సున్నితమైనది. స్త్రీలు ఒంటరిగా వెళ్లలేకపోవడానికి ముఖ్య కారణం శీలం పోతుందనే భయం, ఎవరైనా మానభంగం చేస్తారనే భయం.

కానీ పురుషుడు గర్భం ధరించడు. పురుషుడికి శీలం గొడవ వుండదు. అందుచేత ఆ రకమైన భయం పురుషుడిలో ఉండదు. పురుష జన్మలలో నిర్భయంగా జీవించడం నేర్చుకోవడానికి ఇది కూడా ఒక కారణం. పురుషులుఎవరైనా భయపడుతున్నారు అంటే, వాళ్ళు ఇంకా ధైర్యం అనే లక్షణం నేర్చుకోలేదని అర్థం. అంతేకాదు అంతకుముందు వారు తీసుకున్న స్త్రీ జన్మల్లోని లక్షణాలు ఇంకా పోలేదని లెక్క, అందేరూ భయపడుతూ వుంటారు.

మానవుడు అంటే శరీరమే కాదు మనసు, బుద్ధి, ఆత్మ అని ఎన్నోసార్లు చెప్పుకున్నాం. అంటే మానవుల్లో శారీరక స్థితిలో జీవించే వాళ్ళు ఉన్నారు, మానసిక స్థితిలో జీవించే వాళ్ళు ఉన్నారు, బుద్ధి స్థితిలో జీవించే వాళ్ళు ఉన్నారు, ఆత్మస్థితిలో జీవించే వాళ్ళూ.. ఉన్నారు.

సహజంగా దేహస్థితి, మనోస్థితిలో ఉన్నవారు అన్నిటికీ భయపడుతూ ఉంటారు. కానీ ఎవరైనా "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారా బుద్ధి స్థితిలోకి రాగలిగితే వారికి శారీరక సౌష్టవం లేకపోయినా నిర్భయంగా తన బుద్ధి కుశలతతో ఎటువంటి సందర్భం ఎదురైనా ధైర్యంగా దాన్ని అధిగమిస్తారు. ఇది మనకి అర్థం కావాలంటే పంచతంత్రంలో వున్నటువంటి ఒక కథ తెలుసుకుందాం.

## కుందేలు సింహం కథ

ఒక అడవిలోకి ఒక సింహం ప్రవేశించి జంతువులన్నింటిని ఇష్టం వచ్చినట్టు చంపేస్తుంది. అప్పుడు ఆ జంతువులన్నీ సమావేశమై ఇలా వుంటే

మనకి శాంతి ఉండదు, ఆ సింహంతో రాజీ చేసుకుందాం, ప్రతిరోజు ఒకరు ఆహారంగా వెళ్దాం. అప్పుడది ఇంకెవరి మీదా దాడి చేయదు మనం ధైర్యంగా జీవించవచ్చు అని చెప్పి నిర్ణయించుకుని సింహంతో చెప్తే అది అంగీకరించింది. అలా ఒక్కో రోజు ఒక్కో జంతువు దానికి ఆహారంగా వెళుతున్నాయి, ఒకరోజు కుందేలు వంతు వచ్చింది.

ఆ కుందేలు సింహం దగ్గరకు వెళుతూ.. ఈ సింహం పీడ వదిలించుకుంటే ఏ గొడవ లేదు కదా అని తన బుద్ధి కుశలతతో ఆలోచించి సింహం దగ్గరకు వెళ్లి ఇలా అంది. ఓ రాజా! నువ్వే గొప్ప వాడివని అనుకుంటున్నావు. నీకంటే బలమైన వాడు, నీకంటే గొప్పవాడైన ఇంకో సింహం ఈ అడవిలోకి ప్రవేశించింది. ఇంక నీ ఆటలు సాగవు అని చెప్పింది.

అప్పుడు ఆ సింహానికి చాలా కోపం వచ్చింది, పౌరుషం వచ్చింది, నాకంటే బలమైన వాడా? ఎవడు చెప్పు? వాడి సంగతి తేలుస్తాను అంది. అప్పుడు కుందేలు నాతో రా అని చెప్పి, ఆ అడివిలో పాడు పడిపోయి వున్నటువంటి ఒక నూతిని చూపించి అదిగో అందులో ఆ సింహం వుంది అని చెప్పింది. వెంటనే ఆ సింహం ఆ నూతిలోకి తొంగి చూస్తే నీళ్లలో దాని నీడే కనిపించింది. అది ఇంకో సింహం అనుకుని దాన్ని చూసి గాండ్రించింది. ఆ నూతిలో రీ సౌండ్ వచ్చి అది కూడా అరిచినట్టుగా కనిపించింది. నీ సంగతి చెబుతాను అని వెంటనే నీటిలోకి దూకి ఆ నూతిలో పడి చనిపోయింది.

అలా ఆ కుందేలు తన బుద్ధి కుశలతతో అంత పెద్ద సింహాన్ని ఓడించ గలిగింది. అంటే దేహస్థితిలో, మనోస్థితిలో జీవించినంత కాలం మనం ఏ పరిస్థితిని అధిగమించలేము. చాలా మంది బలం ఉంటే నిర్భయంగా జీవించవచ్చని అనుకుంటారు. కాని బలం కంటే ధైర్యం,

బుద్ధి ఉంటే ఎటువంటి పరిస్థితులనైనా అధిగమించవచ్చు. అందుకే దేహబలం కంటే బుద్ధిబలం గొప్పది అంటారు.

నేను అందుకే బుద్ధి సంపాదించుకోండి అంటాను. ఈ జన్మలో మీరు బుద్ధి స్థితికి వచ్చినా మీరు చాలా సాధించినట్టే, చాలా అదృష్టవంతులనే చెప్పుకోవచ్చు. మీరు కనుక తమోగుణంలో, రజోగుణంలో ఉన్నారు అంటే బుద్ధిస్థితికి వచ్చినట్టు కాదు. సాత్విక గుణంలోకి వచ్చినప్పుడే మీరు బుద్ధి స్థితిలోకి వచ్చినట్టు. దానికి తీవ్రమైన ధ్యాన సాధన చేయండి, సాత్వికమైన శాఖాహారం తీసుకోండి, ఈ రెండు చాలు ఇంకేమీ అవసరం లేదు.

భీమవరం వచ్చినప్పుడే అంతటి తీవ్ర సాధన మీరు చేయ గలుగుతారు. అంతేకాదు సరైన సాధన "శ్వాస మీద ధ్యాస" ఉంచి నిశ్శబ్ద ధ్యానం చేయగలుగుతారు. ఇంకెక్కడికి వెళ్లినా అసలు సరైన సాధన లేదు. గైడింగ్ అంటారు, మ్యూజిక్ అంటారు, పత్రి గారు పెట్టారంటారు. ఇలా ఎన్నో కారణాలు చెప్పి సరైన సాధన చేయలేకపోతున్నారు. అలా ఎన్ని సంవత్సరాలు చేసినా.. చేసినదంతా వృధా అయిపోతుంది.

తీవ్ర సాధన చేసినప్పుడు మాత్రమే మీరు బుద్ధి స్థితికి వస్తారు. అప్పుడు మీ జీవితంలో ఎటువంటి సందర్భం ఏర్పడినా దాన్ని మీ బుద్ధి కుశలతో అధిగమిస్తారు. అవతల వాడు బలం ఉన్నవాడా, లేనివాడా అన్నది సంబంధం లేదు, దానికి బలం అక్కర్లేదు.

భార్యాభర్తల్లోనైనా సరే, ఇంకెక్కడైనా సరే ఏ సందర్భం ఏర్పడినా, ఎదుటివారు ఏం మాట్లాడినా దానికి తగ్గ సమాధానం మనం చెప్పగలిగితే అవతల వాడు ఆలోచనలో పడతాడు, మారు మాట్లాడలేదు. అదే మీరు బుద్ధి స్థితి దాటి ఆత్మస్థితికి చేరుకున్నట్లయితే ప్రాణాలకు కూడా లెక్కచేయకుండా ఏ పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొంటారు. వారికి శారీరక బలమే అవసరం లేదు, కావాల్సింది నిర్భయత్వం.

ఆత్మ అంటే భగవంతుడు, భగవంతునికి భయమెక్కడుంటుంది?

అంతా నిర్భయమే. అందుచేత అటువంటివారు ఏ పరిస్థితుల్ని అయినా నిర్భయంగా ఎదుర్కొంటారు, నిర్భయంగానే ప్రవర్తిస్తారు.

ఆత్మ స్థితిలో ఉన్నటువంటి మహమ్మద్ ప్రవక్తనే తీసుకుందాం. ఆయన ఎక్కువ యుద్ధాలలో పాల్గొనేవాడు. ఆయన ఒకసారి యుద్ధం చేస్తున్నప్పుడు శత్రువు ఆయన్ని పడగొట్టి, కత్తి మహమ్మద్ పీక మీద పెట్టి నిన్ను ఇప్పుడు ఎవరు వచ్చి రక్షిస్తారో? నేను చూస్తాను అన్నాడు. అప్పుడు మహమ్మద్ ప్రవక్త ఏమీ జంకకుండా నా అల్లా వచ్చే రక్షిస్తాడు అని చాలా ధీమాగా చెప్పాడు. అంత ధీమాగా మహమ్మద్ చెప్పగానే వాడు కొంచెం తడబడ్డాడు. అదే క్షణంలో మహమ్మద్ వాడి మీద తిరగబడి తన కత్తి మళ్లీ వాడి పీక మీదే పెట్టి, నీకు అల్లా కూడా లేడు. ఇప్పుడు నిన్ను ఎవరో రక్షిస్తారో? నేను చూస్తాను అన్నాడు. అంటే అలాంటి ఓడిపోయే పరిస్థితిలో కూడా తనకంటే బలమైన వారిని నిర్భయంగా ఎదుర్కొన్నాడాయన.

ఆత్మస్థితిలో ఉన్నవాళ్లు ఎప్పుడైనా సరే అలా నిర్భయంగా జీవిస్తారు. మనం పత్రి గారినే తీసుకుంటే, మహమ్మద్ ప్రవక్త లాగే ఆయన కూడా ఆత్మ స్థితిలో ఉన్నటువంటి గొప్పవారు. ఆ స్థితిలో ఉన్నారు కాబట్టే ఆయన చెప్పే సత్యాలు చాలా లోక విరుద్ధంగా ఉంటాయి, ఆయన చెప్పే సత్యాలు ఎవరూ జీర్ణించుకోలేరు. కాని ధైర్యంగా చెపుతారు. ఆయన విగ్రహం దేవుడు కాదు, విగ్రహన్ని ఆరాధించడం కాదు, సత్యాన్ని ఆరాధించండి అని చెప్తున్నప్పుడు కొన్ని కొన్నిచోట్ల, కొన్ని కొన్ని సందర్భాల్లో అజ్ఞానంలో ఉన్నవాళ్లు ఆయన పై ఎదురు తిరిగేవాళ్లు. ఎదురు తిరగడమే కాదు, దాడి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆత్మస్థితిలో ఉన్న పత్రీజీ నిర్భయంగా తాను చెప్పదలుచుకున్న సత్యాన్ని ధైర్యంగా చెప్పేవారు.

కాని సత్యాన్ని నిర్భయంగా చెప్పేటప్పుడు ప్రకృతి సహకారం ఉంటుంది. అటువంటప్పుడు వారికి ఎటువంటి పరిస్థితి ఎదురైనా ప్రకృతి సహకారంతో వాళ్లు దాన్ని తేలికగా అధిగమిస్తారు. నిజంగా అంతమంది

ఎదురు తిరిగి హఠాత్తుగా మీదకు వస్తే పత్రి గారు ఒక్కరే ఆ ప్రకృతి సహకారంతో ఆ పరిస్థితిని అధిగమించేవారు.

నేను అదే చెప్తూ ఉంటాను, సత్యాన్ని పట్టుకోండి, సత్యాన్ని బోధించండి, సత్యములో జీవించండి, ప్రకృతి యొక్క సహకారం మీకు పూర్తిగా ఉంటుంది అని. మీకు ఒక్కటే చెప్తున్నాను మీరు పురుషుడైనా, బలహీనమైన శరీరం ఉన్న స్త్రీ అయినా సరే, ఎవరైనా సరే నిర్భయంగా ప్రవర్తించాలన్నా, అలా జీవించాలన్నా ఆత్మస్థితి సంపాదించుకోవాలి, కనీసం బుద్ధి స్థితికైనా చేరుకోవాలి, అప్పుడు దేనికి భయపడరు.

చాలామంది భీమవరం రమ్మంటే ఒక్కదాన్నే రాలేనండి అంటారు. నా డబ్బులు పోతాయి, నా బంగారం పోతుంది, లేకపోతే నాకు ఏదైనా జరుగుతుందని చెప్పి అనుకుంటూ ఉంటారు. మీ వల్ల ఎవరికీ హాని జరగకపోతే, ఎవరి వల్లా మీకు ఎటువంటి హాని జరగదు. మీరు ఎవరి డబ్బుని గాని, ఏదైనా సరే మోసగించి తీసుకోకపోతే, నష్టం కలిగించకపోతే, మీకున్న ధనానికి ఏ ఆపద లేదు.

మీరు ఇతరులను మోసగిస్తే మీరు ఇంటికి ఎన్ని తాళాలు వేసినా, ఎవరో ఒకళ్ళు దోచుకుపోతారు. కానీ మీరు ఎవ్వరిది ఆశించనప్పుడు, మోసగించనప్పుడు ఏ కారణం చేతనైనా సరే మీరు తలుపులు బార్లా తీసి ఇంట్లో పడుకున్నా ఇంట్లోకి ఎవ్వరూ రారు. ఏదైనా జరిగింది అంటే కచ్చితంగా నువ్వేదో చేసావని లెక్క.

కొంతమంది స్త్రీలను కిడ్నాప్ చేస్తున్నారు, బ్రోతల్ హౌసెస్‌కి అమ్మేస్తున్నారు అని అనచ్చు. కాని వాళ్లంతా గత జన్మలలో పురుషుడిగా రేప్లు, కిడ్నాప్లు చేసి ఆ స్త్రీలను బాధించిన వాళ్లే! ఈ జన్మలో స్త్రీగా పుట్టి అలాంటి నరకం అనుభవిస్తున్నారు.

గుర్తుపెట్టుకోండి మీరు ధర్మంగా ఉన్నప్పుడు, న్యాయంగా వున్నప్పుడు, నీతిగా జీవించినప్పుడు మీకెందుకు భయం? వాళ్లతో మీరు

పోల్చుకుంటారేంటి? అలాంటి తప్పులు చేస్తే మీరు భయపడాలి. మీరు అలాంటి పనులు చేసే వాళ్ళా? ప్రారంభ జన్మల్లో ఉన్నవాళ్లు అలా చేస్తారు, నేర్చుకుంటారు. అది వాళ్లకు సంబంధించింది, పిచ్చోళ్ళు కాకపోతే వాళ్లకు జరిగింది కాబట్టి నాకు జరుగుతుంది అనుకోవడమేమిటి? మీరంతా 350 జన్మలు దాటి ఉన్నారు. అవన్నీ అధిగమించేశారు.

ఆ పాఠాలన్నీ అయిపోయాయి మీకు. దోచుకోవడం, దోచుకోబడడం. రేపులు చేయడం, చేయబడడం అన్నీ అయిపోయాయి. హత్య చేయడం, హత్య గావించబడడం అయిపోయాయి. ఇప్పుడు మీ స్థితి ఏమిటంటే? జ్ఞానం సంపాదించుకుని, జన్మలేని స్థితి సంపాదించే ప్రయత్నం చేస్తున్నారు, మీరు ఆ స్థాయికి వచ్చారు.

మీకు ఇన్ని జన్మలు గడిచాయని చెప్తున్నా ఇంకా భయం పోలేదు అంటే మూర్ఖత్వం పోలేదు. నేనేమైనా తప్పు చేశానేమో అని మీకేమైనా డౌట్ ఉందా? ఒకవేళ చేసి ఉంటే, ఇప్పుడు ఏమైనా అయిపోతుందేమో అని అనుకుంటే, నువ్వు ఎంత ఇంటి దగ్గర ఉన్నా.. అయ్యేది అవ్వక మానదు. నేను కచ్చితంగా చెప్తున్నాను నువ్వు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చేసుకున్నది అనుభవించాల్సిందే..తప్పించుకోవడం నీ తరం కాదు. చాలా మంది బయటకు వెళ్తే యాక్సిడెంట్ లో ఏ కాలో విరిగిపోతుందని ఇంట్లోనే జాగ్రత్తగా ఉంటారు. ఇంట్లోనే ఉంటూ బాత్రూంలో పడి కాళ్ళు విరగ గొట్టుకున్న వాళ్ళు ఎంతమంది లేరండి. కర్మ ఫలితాన్ని తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదు.

నీకు ఎవరి వల్లా హాని జరగకూడదు, దేనికి భయపడకూడదు అంటే! నీ వల్ల ఎవరికీ కష్టం గానీ, నష్టం గానీ, హాని గానీ, హింస గానీ జరగకుండా జాగ్రత్త పడు. ఇది నువ్వు చేయగలిగితే ఇక నీకేమీ జరగదు.

చాలామంది చెప్తూ ఉంటారు. మా ఇంట్లో చీమలు, ఎలుకలు, బొద్దింకలు వస్తున్నాయండీ ఎలా అండి? అంటారు. వాటిని చంపకుండా

నువ్వు జీవించు, ఏదీ నీ జోలికి రాదు. దోమలైన సరే మీ ఇంట్లోకి వస్తాయి కానీ నీ దగ్గరికి రావు, ఆ స్థితి సంపాదించాలి. మీరు ఇంకా బుద్ధిస్థితికి రాకపోతే ఇలాంటివే ఆలోచిస్తారు.

అది నాకేమైనా హాని చేసేస్తుందేమో అనిపిస్తే ఆ ఎలుకను తీసి బయట వదిలేయ్, చంపకు, మందు పెట్టకు, ఆ బొద్దింకలు పట్టుకుని చేటలోకి ఎత్తి బైట వెయ్యి. నువ్వు అలా చేయగా, చేయగా అవి ఏవి నీ జోలికి రావు. నీ భావాన్ని గ్రహించగలిగే శక్తి వాటన్నిటికీ ఉంది. వాటి భావాన్ని గ్రహించే శక్తి నీకే లేదు. ఏ జంతువైనా సరే మీరు గమనించండి మీకు ఎదురు పడినప్పుడు అవి మీ కళ్ళలోకి చూస్తాయి. మీ కళ్ళ ద్వారా మీ భావాన్ని అవి గ్రహిస్తాయి. నువ్వు హాని చేసే ఉద్దేశ్యంతో ఉన్నావా అని చూస్తాయి. నువ్వు భయంతో దాన్ని కర్రతో కొట్టాలా, చంపాలా అని ఆలోచిస్తావు. ఎప్పుడైతే దానికి హాని చేయాలనే భావం నీలో కనిపిస్తుందో, నువ్వు హాని చేసేలోపులోనే అది నీ మీద దాడి చేస్తుంది.

అందుచేత నువ్వు ధర్మంగా జీవిస్తే ఎవరికీ భయపడవలసిన పనిలేదు. నిర్భయంగా జీవించవచ్చు. దాని కోసమే ఇవన్నీ నేర్చు కుంటున్నాం. ఎంత కాలం బ్రతికామన్నది గొప్ప కాదు, ఎలా బ్రతికాము అన్నది ముఖ్యం. అన్నిటికీ భయపడుతూ, ఎప్పుడూ ఆందోళన పడుతూ, అశాంతిగా, దుఃఖంతో ఎందుకు ఈ జీవితం?

నేను అందుకే కచ్చితంగా చెప్తాను. భీమవరం కొన్ని నెలల పాటు వచ్చి తీవ్రమైన సాధన చెయ్యండి, బుద్ధిస్థితికి రండి, మీలో ఎంత మార్పు వస్తుందో చూడండి. మీరు ధైర్యంగా జీవించడమే కాదు, నిర్భయంగా జీవించడమే కాదు, అందరినీ ఆ రకంగా జీవింప చేస్తారు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.160/-
6) ఆత్మ శాస్త్రం - రూ.130/-
7) ధ్యాన శాస్త్రం - రూ.130/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) ధ్యాన శక్తి - రూ.130/-
10) తెలుసుకోండి - రూ.130/-
11) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
12) మరణించకముందే మరణించాలి- రూ.130/-
13) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
14) గీతాసందేశం - రూ.120/-
15) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) కర్మ సిద్ధాంతం - రూ.80/-
18) ధ్యానమంటే ? - రూ.80/-
19) త్రివిధాలు - రూ.80/-
20) ఉత్తమ పురుషుడు - రూ.80/-
21) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
22) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
23) జ్ఞాన జ్యోతి - రూ.70/-
24) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
25) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
26) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
27) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
28) బుద్ధుని సందేశాలు - రూ.70/-
29) భూతదయే దైవత్వం - రూ.70/-
30) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
31) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
32) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
33) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
34) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
35) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
36) అతీంద్రియ శక్తులు - రూ.60/-
37) ఆలోచించండి - రూ.60/-
38) నిర్వాణ మార్గం - రూ.60/-
39) ధ్యానులకు సూచనలు - రూ.60/-
40) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
41) సంకల్పమంటే? - రూ.50/-
42) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
43) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
44) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/-
45) మహాత్ముల సందేశాలు - రూ.40/-
46) సత్యం - రూ.40/-
47) చక్రాలు - రూ.40/-
48) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
49) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
50) మౌన ధ్యానం - రూ.40/-
51) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
52) శాకాహారమే మానవాహారం - రూ.15/-
53) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



సహజంగా నేను స్త్రీని లేదా నేను పురుషుడిని అనుకుంటారు. కానీ ఇవన్ని మనకి జన్మలు. స్త్రీ అయితే స్త్రీ జన్మ, పురుషుడైతే పురుష జన్మ. అంటే మనం స్త్రీ కాదు, పురుషుడు కాదు, మనమంతా ఆత్మలం. ఆత్మలమైన మనం పూర్ణాత్మ నుంచి కానీ, మూలాత్మ నుంచి కానీ విడువడిన అంశాత్మలం. ఈ అంశాత్మ ఒక మానవ శరీరంలో ప్రవేశపెట్టబడి జీవుడిగా పిలవబడుతుంది.

ఆ జీవుడికి ఆ పూర్ణాత్మ ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. నువ్వు ఈ భూమి మీద ఎన్నో పాఠాలు నేర్చుకుని, జ్ఞానాన్ని పొంది మా స్థాయికి ఎదగాలి అంటే పూర్ణాత్మ కావాలి. అప్పటిదాకా నువ్వు జన్మలు తీసుకుంటూనే వుంటావు, అని చెప్పి జనన, మరణం చక్రంలో ప్రవేశ పెడుతుంది. అలా ప్రతి ఒక్కరూ మానవ జన్మలో ప్రవేశిస్తారు. అప్పటినుంచి కర్మ చక్రంకూడా ప్రారంభమవుతుంది.

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

రూ.70/-